గాడి తప్పిన సచివాలయాలు..!



- పని వేళలు పాటించని ఉద్యోగులు
- తనిఖీలు, పర్యవేక్షణ పట్టించుకోని ఉన్నతాధికారులు
- సచివాలయాల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు
- జిల్లా పీజీఆర్ఎస్‌కు దరఖాస్తుల వెల్లువ
- సమావేశాలు నిర్వహించని స్పెషల్ ఆఫీసర్లు, మండల ఆఫీసర్లు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసింది. గ్రామ వార్డు సచివాలయాల్లో పరిష్కారం కావాల్సిన సమస్యలు కలెక్టర్ కార్యాలయానికి వెళుతున్నాయి. సచివాలయ స్థాయికి చెందిన సమస్యలు అక్కడ పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల్లో ప్రింటర్ పని చేయడం లేదని, కంప్యూటర్ పని చేయడం లేదని, ప్రింట్ ఇచ్చే సర్టిఫికెట్లు అయిపోయాయని అధికారులు చెబుతున్నారు. ప్రతి మండలంలో 15 నుంచి 25 గ్రామాలు ఉన్నాయి. ఏ ప్రభుత్వ పథకం అందాలన్నా సచివాలయాలే కీలకం. కుల ఆదాయ సర్టిఫికెట్లు, జనన మరణ పత్రాల పనులు సచివాలయంలోనే జరగాలి. కానీ నేడు సచివాలయాలు అవినీతికి కేంద్ర బిందువుగా మారుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. పొలం సబ్ డివిజన్, వన్‌బీ, అడంగల్, ఆర్‌వోఆర్ పొందాలంటే సచివాలయానికి వెళ్లాల్సిందే. గ్రామ, మండల, నగర మున్సిపాలిటీలలో పరిష్కారం కావాల్సిన అర్జీలు వేల కొద్ది సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాలపై పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల ఆఫీసర్లు, స్పెషల్ ఆఫీసర్లు కనీసం గ్రామ, వార్డు సచివాలయాలను తనిఖీ చేస్తే కొంత వరకైనా పరిష్కారం లభిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం అర్జీలను చేత పట్టుకుని మండల కేంద్రానికి, సచివాలయానికి అధికారులు తిప్పుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

మ్యాపింగ్‌లో లీలలు

గ్రామ, వార్డు సచివాలయాల్లో గత వైసీపీ ప్రభుత్వంలోని వలంటీర్లు ఇళ్లను మ్యాపింగ్ చేశారు. దీని వల్ల ఇప్పటికీ అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వలంటీర్లు డబ్బులు దండుకుని పింఛన్ మంజూరు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎక్కువ పొలం ఉన్న రైతులకు ఇన్‌కం ట్యాక్స్ కట్టేవారికి కూడా పింఛన్లు మంజూరు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న భూసర్వే తప్పుల తడకగా సాగడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.



తీవ్రంగా జాయింట్ ఎల్‌పీఎం సమస్య

జాయింట్ ఎల్‌పీఎంను సబ్ డివిజన్ చేయాలన్న గ్రామ సర్వేయర్‌కి రైతులు పైసలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఓర్వకల్లు, కర్నూలు, కల్లూరు పరిధిలోని భూ సమస్యలను పరిష్కారం చేసుకోవాలంటే లక్షల్లో అధికారులు, ముడుపులు చెల్లించుకునే పరిస్థితి నెలకొంది. ఇంటి పన్ను, నీటి పన్ను వసూలు చేయడంలో సచివాలయ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. గ్రామాల్లోని ప్రజలు ఇంటి పన్ను, నీటి పన్ను డబ్బులు ఇచ్చినా రసీదు ఇవ్వడం లేదు. పన్నుల విషయంలో సచివాలయ అధికారులు ప్రచారం చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.

సమయపాలన లేదు

ఉదయం 10 గంటలకే గ్రామ, వార్డు సచివాలయాల పని వేళలు ప్రారంభం కావాలి. కానీ ఉదయం 11.30 గంటల వరకు కూడా సచివాలయ అధికారులు విధులకు హాజరు కావడం లేదు. ప్రజలు సచివాలయాలకు వచ్చి వెళ్లిపోతున్నారు. ఉదయం 12 గంటలకు అధికారులు సచివాలయానికి వచ్చి అలా మొహం చూపించి వెళ్తున్నారు. ఎవరైనా ప్రజలు ప్రశ్నిస్తే ఫీల్డ్‌లో ఉన్నామని, మండల ఆఫీసులో మీటింగ్ ఉందని, మరికొందరు కలెక్టరేట్‌లో పని ఉందని సమాధానం చెబుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

- మొత్తం అర్జీలు 56,754
- పరిష్కారం చూపినవి 50,028
- పురోగతిలో ఉన్నవి 2,222
- ఇంకా చూడని దరఖాస్తులు 29
- పెండింగ్‌లో ఉన్నవి 1,264



సచివాలయాలను తనిఖీ చేస్తాం



జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాలను ఖచ్చితంగా తనిఖీ చేస్తాం. సచివాలయ అధికారులు పని వేళలు పాటించాలి. విధులకు హాజరు కాని వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

- నూరుల్ ఖమర్, జేసీ, కర్నూలు

ఎవరికీ సంతోషం లేదు

- ప్రజా వ్యతిరేకంగా మారిన కూటమి పాలన
- పీపీపీ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు..
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

కర్నూలు న్యూసిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి పాలన వల్ల రాష్ట్రంలో ఎవరూ సంతోషంగా లేరని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ.ఈశ్వరయ్య విమర్శించారు. గురువారం సీఆర్ భవన్‌లో రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కే. రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రామచంద్రయ్యతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం రాకముందు ఒక మాట, వచ్చిన తరువాత ఒక మాట మాట్లాడుతూ ప్రజా వ్యతిరేకంగా తయారైందని అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్ని పరిశ్రమలు స్థాపించింది, ఎంత ఉత్పత్తి పెంచింది చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భూ బ్యాంక్ పేరుతో నియోజకవర్గానికి లక్ష ఎకరాలు గుర్తించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు కట్టపెట్టడం సరికాదని అన్నారు. చంద్రబాబు మోదీని పొడిగితే.. మోదీ లోకేశ్‌ను పొగుడుతున్నారని ఎద్దేవా చేశారు. సీమలో సాగు నీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్. లెనిన్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కే.జగన్నాథం, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రేడ్-4గా పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-3 పదోన్నతులు లభించనున్నాయి. దాదాపు జిల్లాలో సుమారు 50 ఖాళీలు ఉన్నాయి. గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శుల భర్తీ అనంతరం గ్రేడ్-5 నుంచి 50 గ్రేడ్-4 పదోన్నతులు భర్తీ చేయనున్నారు. ఇటీవల గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు 122 గ్రేడ్-4 పదోన్నతులను కల్పించారు. అదేవిధంగా గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులకు కూడా 122 పదోన్నతులు లభించాయి.

21 నుంచి సాగు నీరు

- తీర్మానం చేసిన జీడీపీ రైతుల సాగునీటి సంఘం
- నేడు ఇరిగేషన్ ఎస్ఈ కలవనున్న సంఘం సభ్యులు

గోనెగండ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు కింద రబీలో సాగు చేసుకుంటున్న ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ ప్రాంతాల ఆయకట్టు రైతులకు ఈ నెల 21వ తేదీ నుంచి సాగు నీరు విడుదల చేయాలని జీడీపీ ఆయకట్టు రైతుల సాగునీటి సంఘం సభ్యులు తీర్మానం చేశారు. గురువారం గాజులదిన్నె ప్రాజెక్టు కార్యాలయంలో సాగునీటి సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇరిగేషన్ డీఈ సబ్బరాయుడు, ఏఈ మహమ్మద్ ఆలీ, జీడీపీ ఆయకట్టు సాగునీటి సంఘం అధ్యక్షుడు మల్లికార్జున గౌడ్ హాజరయ్యారు. ప్రాజెక్టులో ఎన్ని టీఎంసీల నీరు ఉంది? ఎన్ని ఎకరాలకు ఈ ఏడాది సాగునీరు అందిస్తారు? కుడికాలువ కింద ఎంత సాగు చేయాలి? ఎడవ కాలువ కింద ఎంత సాగు చేయాలి? అని అధికారులు, సాగునీటి సంఘం సభ్యులు చర్చించారు. పంటలు పూర్తిగా చేతికి అందే వరకు సాగునీరు విడుదల చేయాలని సాగునీటి సంఘం సభ్యులు కోరారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 3.9 టీఎంసీ నీరు ఉందని అధికారులు తెలిపారు. సాగునీటి సంఘం సభ్యుల తీర్మానాన్ని సభ్యులు శుక్రవారం ఇరిగేషన్ ఎస్ఈ కలసి ఇస్తారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు రామనరసప్ప, బడేసా, కౌలుట్ల, రంగన్న, క్రిష్ణ, ఏఈ శంకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉగ్రనర సింహ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈ సుబ్బరాయుడు

హంద్రీకి జీడీపీ నీరు

4వ గేటు ఎత్తి 300 క్యూసెక్కులు విడుదల

గోనెగండ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి హంద్రీ నదికి గురువారం కూడా నీరు విడుదల చేశారు. ప్రాజెక్టు 4వ గేటు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని హంద్రీనదికి విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. ఈ నెల 19, 20 తేదీలలో తుఫాన్ రానున్నట్లు వాతావరణశాఖ సమాచారం ఇవ్వడంతో ముందస్తుగా జీడీపీ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ తదితర ప్రాంతాలలో అడపదడపా కురుస్తున్న వర్షాల కారణంగా హంద్రీ నుంచి అరకొరగా నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం గాజులదిన్నె ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రానికి నీటి మట్టం(3.9 టీఎంసీ) 375 మీటర్లు ఉంది. దీంతో జీడీపీ నిండు కుండలా మారింది. జీడీపీ పూర్తిస్థాయి నీటి మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 2 మీటర్ల మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో నీరు సామర్థ్యానికి తగ్గట్టుగా పూర్తిగా ఉందని ఇప్పటి నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటిని ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.



జీడీపీ నాలుగో గేటు ఎత్తి నీటి విడుదల చేసిన దృశ్యం

ఆదోనిలో ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటన



ట్రైనింగ్ కోసం వచ్చిన ఐఏఎస్‌లు

ఆదోని టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వివిధ రాష్ట్రాలకు చెందిన 18 మంది ట్రైనీ ఐఏఎస్‌లు గురువారం ఆదోని పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ రకాల సేవలను తెలుసుకొన్నారు. పారిశుధ్య పనులను, చెత్త తరలింపు కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో గమనించి వివరాలను తెలుసుకొన్నారు. జంతు వధశాలను, మున్సిపాలిటీ నిర్వహణలో ఉన్న వివిధ పార్కులను సందర్శించి, వాటి నిర్వహణ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నాసిర్ హుస్సేన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్ కుమార్ వీరికి అన్ని శాఖల పని తీరును వివరించారు.

సీసీఐ కేంద్రాల్లో 32,565 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు

ఏడీఎం నారాయణమూర్తి



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో సీసీఐ కేంద్రాల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు రైతుల నుంచి 32,565 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి నారాయణమూర్తి తెలిపారు. ఆదోనిలోని మూడు సీసీఐ కేంద్రాలు, అదే విదంగా ఎమ్మిగ నూరులో 3 సీసీఐ కేంద్రాలు, కోడుమూరులో ఒకటి, మంత్రాలయంలో ఒకటి ప్రభుత్వం నిర్ణయించిన జిన్నింగ్ మిల్లుల్లో రైతుల నుంచి పత్తి కొనుగోలు వేగవంతం చేశామని తెలిపారు. కర్నూలు జిల్లాలో 1,426 మంది రైతుల నుంచి 32,565 క్వింటాళ్లను కొనుగోలు చేశామని, వీరికి చెల్లించాల్సిన రూ.25.47 కోట్లు కొద్ది రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు. రైతులు పత్తిని ఇంటి వద్దనే ఆరబెట్టుకుని తేమ శాతం 8 నుంచి 12 మధ్యనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కపాస్ కిసాన్ యాప్ ద్వారా సీసీఐ కేంద్రాలకు ఎప్పుడు పత్తిని తీసుకెళ్లాలో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. రైతులు తాము పండించిన పత్తిని దళారులకు తక్కువ ధరకే అమ్ముకుని నష్టపోవద్దని విజ్ఞప్తి చేశారు.

నేడు తుంగభద్ర బోర్డు సమావేశం

హాలహర్వి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి విడుదలయ్యే రబీ సాగు, తాగునీటిపై నేడు బోర్డు ఏపీసీసీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తుంగభద్ర బోర్డు ఎస్ఈ నారాయణనాయక్ తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో 76 టీఎంసీలు నీరు నిల్వ ఉందని, తుంగభద్ర గేట్లు మరమ్మతుల కోసం ఈ ఏడాది డిసెంబరు 20వ తేదీకి సాగునీరు నిలిపివేయాలంటూ మూడు రాష్ట్రాలకు చెందిన ఇంజనీర్లు తీర్మానం చేశారు. అయితే రబీలో సాగునీరు ఇవ్వాలని కర్ణాటక రైతులు డిమాండ్ చేస్తున్నారు. కర్ణాటక ప్రతిపక్ష పార్టీ బీజేపీ సైతం సాగునీరు ఇవ్వాలంటూ ఆందోళనలు చేస్తోంది. ఈ నేపథ్యంలో నేడు జరగబోయే సమావేశం కీలకం కానుంది. సాగు, తాగునీటిపై నేడు స్పష్టత రానున్నట్లు బోర్డు అధికారులు చెబుతున్నారు.

గడువులోగా అర్జీలను పరిష్కరించండి

కలెక్టర్ డాక్టర్ సిరి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతి అర్జీని గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, సర్వేయర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిరి మాట్లాడుతూ పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌ల పరిష్కారంపై సీఎం కార్యాలయం ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తోందన్నారు. అధికారులందరూ పీజీఆర్ఎస్‌లో ప్రతి రోజు లాగిన్ అయి ఎట్ టూ వ్యూ అర్జీలు లేకుండా చూడాలన్నారు. ఇంటి పట్టాల కోసం చేసుకున్న దరఖాస్తులను త్వరితగతిన వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఉన్నారు.

అనర్హుల తొలగింపునకు చర్యలు



- ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- కిసాన్ సమ్మాన్ నిధి యోజనలో అర్హత లేకున్నా లబ్ధి పొందుతున్నట్లు నిర్ధారణ
- వెరిఫికేషన్ తర్వాతే నిధులు విడుదలయ్యే అవకాశం
- ఆందోళనలో అన్నదాతలు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద కేంద్ర ప్రభుత్వం 21వ విడత నిధుల విడుదల గత నెలలోనే జరగాల్సి ఉండగా.. వివిధ కారణాల వల్ల మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రబీ పంట సాగు కోసం ఉమ్మడి జిల్లాలోని 2,72,757 మంది రైతులకు కేంద్రం 21వ విడత రూ.2వేలను అందించాల్సి ఉంది. అయితే.. రైతుల ఖాతాలకు కేంద్ర ప్రభుత్వం రూ.2వేలను జమ చేయాల్సి ఉండగా.. పిడుగులాంటి వార్త రైతులకు అందించింది. చాలా మంది రైతులు అర్హత లేకపోయినా ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి వారి జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కర్నూలు జిల్లాలో, కర్నూలు అర్బన్‌లో 295 మంది లబ్ధిదారులు ఉన్నారు. కర్నూలు రూరల్‌లో 35,052 మందికి రూ.5.72 కోట్లు, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో రూ.6.881 కోట్లు, అదే విదంగా ఆదోని నియోజకవర్గంలో 18,722 మంది లబ్దిదారులకు ఏటా ఒకో విడతలో రూ.2.96 కోట్లు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తోంది. మంత్రాలయం నియోజకవర్గంలో 41,992 మంది రైతులకు రూ.6.964 కోట్లు, పత్తికొండ నియోజకవర్గంలో 54,774 మంది రైతులకు రూ.10.443 కోట్లు అందిస్తున్నారు. ఆలూరు నియోజకవర్గంలో 63,317 మంది రైతులకు రూ.11.1015 కోట్లును ఈ పథకం కింద అందజేసింది. పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లో 20,287 మంది రైతులకు రూ.3.4165 కోట్లను రైతులకు అందజేస్తున్నారు. మొత్తం కర్నూలు జిల్లాలోని రూ.2,72,757 మంది రైతులకు రూ.47.55 కోట్లను ఒక్కో విడతలో కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తూ వస్తోంది. ప్రస్తుతం 21వ నిధుల విడత కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఫ్లాగ్‌షిప్ డైరెక్ట్ బెనిపిట్స్ ట్రాన్స్‌ఫర్ ప్రోగ్రాం ద్వారా ఈ పథకం నిధులను 20వ విడత నిధులను ఆగస్టు 2న విడుదల చేశారు. ఇప్పుడు ఈ ఏడాదిలో మూడోసారి నిధుల విడుదల కోసం రైతులు ఎదురు చూస్తుంటే... ఇప్పటికే లబ్ధిదారులుగా చేరిన రైతుల్లో చాలా మంది అనర్హులు ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ చేసిన తర్వాతనే రైతులకు నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా నిబంధనలను కఠినతరం చేసి వెరిఫికేషన్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు పది రోజుల క్రితమే ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు వ్యవసాయ శాఖ జిల్లా కేంద్రానికి ఈ ఉత్తర్వులు కొన్ని రోజుల క్రితమే అందాయి. అర్హత లేని వారిని తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. పీఎం కిసాన్ పథకంలో పారదర్శకతను తీసుకువచ్చే క్రమంలోనే ఈ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఈ పథకం కింద కేంద్రం ఏటా ఒక్కో రైతుకు రూ.6వేల నుంచి పంట సాగు కోసం పెట్టుబడి ఇస్తోంది. ఈ మొత్తాన్ని మూడు విడతలుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. ఇప్పటికీ 20 విడతల నిధులను రైతులకు అందించారు. వాస్తవంగా నవంబరు తొలి వారంలోనే నిధులు విడుదల చేస్తారని ప్రచారం జరిగినా.. అనర్హులను జాబితా నుంచి తొలగించేందుకే పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు జిల్లా వ్యవసాయ అధికార వర్గాలు తెలిపాయి.



వెరిఫికేషన్ చేస్తున్నాం

కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద ఏటా అర్హులైన రైతులకు రూ.6వేలు మూడు విడతలుగా అందిస్తుంది. 21వ విడత త్వరలోనే రైతుల బ్యాంకు కాతాలకు జమ కానుంది. ప్రస్తుతం కేంద్రం ఆదేశాల మేరకు పీఎం కిసాన్ పథకం కింద అనర్హులు ఎవరైనా ఉంటే గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో పరిశీలన చేయిస్తున్నాం.

- వరలక్ష్మి, వ్యవసాయ శాఖ జేడీ



మాయమైపోతున్నడమ్మా.. మనిషన్నవాడు

దస్తగిరి ఆచారి మృతదేహం (ఫైల్)

- మంట కలిసిపోతున్న మానవత్వం
- పెరిగిపోతున్న హింసాత్మక ధోరణి
- అను'బంధాల'ను మరిచి.. క్షణికావేశాలకులోనై హత్యలు
- ఆప్తులను కోల్పోయి దుఃఖసాగరంలో బాధితులు

మనిషిలో మానవత్వం మంట కలుస్తోంది..
హింసాత్మక ధోరణి పెరిగిపోతోంది..
జీవనరాగం శృతి తప్పి.. బాంధవ్యాలు గతి తప్పాయి
స్వార్థం, ద్వేషం, అసూయ, ఈర్ష్య పెరిగి..
ప్రేమ, కరుణ, దయ, జాలి తగ్గి..
మనిషిని మృగంలా మార్చివేశాయి..
సాఫీగా సాగాల్సిన సంసార నౌక
అనుమానమనే పెనుభూతానికి మునిగిపోతోంది.
తలకొరి పెట్టాల్సిన చేతులే ఉరితాడు బిగించి,
కసాయిగా మారి కన్నతండ్రినే కడతేర్చి..
కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచేస్తున్నాయి.
స్నేహబంధం అన్ని బంధాల్లో కెల్లా అమూల్యమైనది..
అలాంటి బంధానికి సైతం చెదలు పట్టింది.
మద్యం మిత్రుడి హత్యకు ఊసిగొల్పింది..
ప్రాణ స్నేహితుడే కడతేర్చాడు..
ఏమిటీ ఘటనలు.. విషాదంలో ముంచెత్తే చర్యలు..
మానవుడా మేల్కో.. బంధాలను గుర్తించు..
అను'బంధాల'ను పంచి.. మంచి మనిషిలా జీవించు..!

కోడుమూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో మనిషన్న వాడు మాయమైపోతున్నాడు. స్వార్థం, ద్వేషం, కసి అనే ఎండమావుల వెంట పరుగు పెడుతూ చివరకు దుఃఖసాగరంలో మునుగుతున్నాడు. ఇటీవల జరిగిన దారుణ ఘటనలు చూస్తే సభ్య సమాజం ఎటువైపు వెళ్తుందోనని భయమేయక తప్పదు. అసలు ఏమైంది ఈ సమాజానికి.. మనిషి ఇలా మారడానికి కారణం ఎవరు? పరిస్థితులా.. సమాజమా.. విపరీత ధోరణా? ఇలా ఎన్నో ఆలోచనలు వస్తాయి.. రోజురోజుకు హింస పెరిగిపోతుంది. కసాయిగా మారుతున్న కొడుకులు.. అనుమానమనే పెనుభూతం కావడంతో కట్టుకున్న వాడినే కడతేర్చిన భార్య.. మద్యం మత్తులో మిత్రుడినే అనంత లోకాలకు పంపిన ఘటనలపై 'ఆంధ్రజ్యోతి' కథనం..



రోదిస్తున్న దస్తగిరి ఆచారి పిల్లలు (ఫైల్)

కారుణ్య నియామకం పొందేందుకేనా?



రామాచారి (ఫైల్)

కారుణ్య నియామకం పొందేందుకు ఓ తనయుడు తండ్రినే కడతేర్చాడు.. ఈ ఘటన ఇటీవల సంచలనం సృష్టించింది. కోడుమూరు మండలంలోని పులకుర్తి గ్రామానికి చెందిన రామాచారి (57) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రామాచారి, విరూపాక్షమ్మ దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు. రామాచారి తన కొడుకు కోసం ఇల్లు కూడా కట్టించాడు. కొడుకు వీరసాయి డిగ్రీ వరకు చదివాడు. కర్నూలులోని ఓ ఫార్మసీ దుకాణంలో పని చేసేవాడు. వీరసాయి ఎప్పుడూ అసంతృప్తితో ఉండేవాడు. తల్లిదండ్రులతో నిత్యం గొడవపడేవాడు. ఈ క్రమంలో సెప్టెంబరు 3వ తేదీ తెల్లవారుజామున నిద్రిస్తున్న తండ్రి రామాచారిని అతడు దారుణంగా హత్య చేశాడు. రోకలితో తల, ముఖంపై కొట్టి చంపాడు. అనంతరం తండ్రి పాదాలను పట్టుకుని క్షమించు నాన్నా అంటూ వేడుకోవడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ సమయంలో తల్లి లేదు. సోదరుడి ఆరోగ్యం బాగాలేకపోవడంతో పుట్టింటికి వెళ్లింది. అంతకు నెల రోజుల క్రితమే వీరసాయి భార్య సుప్రియ రెండో కాన్పు నిమిత్తం పుట్టింటికి చేరింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దారుణానికి ఒడిగట్టాడు కసాయి కొడుకు. భర్త మృతి, ఒక్కగానొక్క కొడుకు జైలుపాలు కావడంతో విరూపాక్షమ్మ జీవితంలో చీకట్లు అలుముకున్నాయి. మరోవైపు భర్త జైలుకెళ్లడంతో సుప్రియ మానసిక క్షోభ అనుభవిస్తోంది. వీరసాయి కారుణ్య నియామకం కోసమే ఇంతటి పని చేశాడని స్థానికులు అంటున్నారు.

మద్యం మత్తులో మిత్రుడినే..



గిరి (ఫైల్)

మద్యం మనుషుల జీవితాలనే నాశనం చేస్తోంది. మద్యం తాగి ఆ మత్తులో ప్రాణ స్నేహితుడినే మృత్యుదరి చేర్చాడు.. ఈ ఘటన మండలంలోని వెంకటగిరి గ్రామంలో ఇటీవలే చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గిరి, మౌలాలి ప్రాణస్నేహితులు. ఇద్దరిదీ దాదాపు ఒకే వయసు. ఇద్దరూ అవివాహితులు. స్నేహానికి కులాలు అడ్డుకాదని ఇద్దరి నమ్మకం. గిరికి ఓ సోదరుడు ఉన్నాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన వారిని మేనత్త పెంచింది. స్నేహితులైన గిరి, మౌలాలి కర్నూలులో జేసీబీ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఇద్దరూ ఒకే గదిలో ఉంటున్నారు. సెప్టెంబరు 6వ తేదీన కోడుమూరులో ఓ వైన్‌షాపు వెనుక మద్యం తాగారు. ఆ సమయంలో ఏం జరిగిందో.. మౌలాలి కత్తితో గిరి(22)ని గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన గ్రామస్థులను కలవరపెట్టింది. హత్య ఎందుకు జరిగిందనే ప్రశ్న గ్రామస్థుల మదిలో మిగిలిపోయింది. ఏదిఏమైనా ప్రాణస్నేహితుడు మట్టిలో కలిసిపోగా, స్నేహం ముందు దోషిగా మిగిలాడు మౌలాలి. జైలుగోడల వెనుక ఉన్న మౌలాలిని మిత్రుడి జ్ఞాపకాలు శిక్షిస్తున్నాయి.

సంసార నౌకను మింగేసిన అనుమాన భూతం



దస్తగిరి ఆచారి (ఫైల్)

జీవితాంతం కలిసిమెలసి ఉండాల్సిన భార్యాభర్తల బంధంలో ఒకరిపై ఒకరికి ప్రేమ, గౌరవం, నమ్మకం ఉండాలి. అప్పుడే ఆ బంధం హాయిగా సాగుతుంది. ఇందులో ఏది కొరవడినా సంసారం నడిసంద్రంలో నావలా మారుతుంది. మండలంలోని ప్యాలకుర్తి సమీపంలో దస్తగిరి ఆచారి హత్యకు గురయ్యాడు. దేవనకొండ మండలంలోని పీ కోటకొండకు చెందిన దస్తగిరి ఆచారి(38), వెంకటేశ్వరమ్మ దంపతులకు ముగ్గురు పిల్లలు. దస్తగిరి ఆచారి ఆటో, కారు డ్రైవింగ్ పనిచేస్తాడు. వెంకటేశ్వరమ్మ ఆశావర్కర్‌గా పనిచేసేది. భార్య ప్రవర్తనపై అతడికి అనుమానం ఏర్పడింది. ఇదే విషయంపై ఇద్దరూ గొడవ పడేవారు. చివరకు భార్య ఆశా ఉద్యోగాన్ని వదులుకుని మరోచోటకు వెళ్లి జీవనం సాగించసాగింది. కొన్నాళ్లకు పిల్లల కోసం భర్త, భార్యతో రాజీ అయ్యాడు. మళ్లీ కొద్దిరోజులకే ఇద్దరి మధ్య కలహాలు మొదలయ్యాయి. భార్యాభర్తల మధ్య గొడవకు కారణం గుర్తించి సరిదిద్దాల్సిన బావమరదులు అదుపుతప్పారు. బావను తీవ్రంగా కొట్టారు. అంతటితో ఆగకుండా అక్టోబరు 27వ తేదీ రాత్రి మద్యం తాగించి టవల్‌తో మెడ బిగించి దారుణంగా చంపేశారు. భార్య వెంకటేశ్వరమ్మ, బావమరదులు శేఖర్, వీరేష్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ పంపారు. తండ్రి చనిపోవడం, తల్లి జైలుకు వెళ్లడంతో వారి ముగ్గురి పిల్లలు అనాధలయ్యారు.

ఆది దంపతుల సేవలో పీఠాధిపతి



పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి దర్శించుకున్నారు. గురువారం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ ఈవో శ్రీనివాసరావు బిల్వమాల సమర్పించగా ప్రధానార్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసుకున్న పీఠాధిపతికి అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదపండితులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రం జ్ఞాపికను అందజేశారు.

మల్లన్న సన్నిధిలో హీరో నితిన్ దంపతులు

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ప్రముఖ సినీ నటుడు నితిన్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం వచ్చిన వీరికి ఆలయ రాజగోపురం వద్ద అధికారులు స్వాగతం పలికారు. అనంతరం నితిన్ దంపతులు స్వామి, అమ్మవార్లకు పూజలు చేసుకుని కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.



కార్తీక దీపాలు వెలిగిస్తున్న నితిన్ దంపతులు

కర్నూలు ఐఐఐటీడీఎం విద్యార్థులకు రూ.అరకోటి ప్యాకేజీతో కొలువు



విద్యార్థులను అభినందిస్తున్న కర్నూలు ఐఐఐటీడీఎం డైరెక్టర్ బీఎస్ మూర్తి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఐఐఐటీడీఎంలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అత్యుత్తమ ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 2025-26 క్యాంపస్ ఇంటర్వ్యూల్లో భాగంగా బీటెక్ సీఎస్ఈ బ్యాచ్‌కు చెందిన వెంకట మహేష్ రెడ్డి, నితీష్ కుమార్ ఇద్దరు విద్యార్థులు ఫిన్‌టెక్ సంస్థ సూపర్ మనీలో వార్షిక ప్యాకేజీ రూ.65 లక్షలతో ఉద్యోగాలను పొందారు. అలాగే బీటెక్ సీఎస్ఈ యు.పాండే అమేజాన్‌లో ఇంటర్న్‌షిప్ పొందడంతో పాటు మైక్రోసాఫ్ట్‌లో ఫుల్‌టైమ్ ఉద్యోగ ఆఫర్‌ను రూ.53లక్షల వార్షిక ప్యాకేజీతో ఎంపికయ్యారు. సీఎస్ఈలో ఇక్షార్ద్ బాత్ర 2027 బ్యాచ్ చెందిన లింక్డ్ఇన్‌లో ఇంటర్న్‌షిప్ సాధించారు. అత్యుత్తమ ప్యాకేజీతో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కర్నూలు ఐఐఐటీడీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, అధ్యాపకులు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ బృందం సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ పవన్ కుమార్, అసిస్టెంట్ ట్రైనీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ దీపక్, డాక్టర్ నోయేల్ నిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

బీ-ఫార్మసీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని జి.పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బీ.ఫార్మసీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 19వ తేదీ ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం 6 నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ (ఒరిజి నల్) రెండు సెట్లు ఫొటోస్టాట్ కాపీలతో నేరుగా హాజరు కావాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కోర్సు ఫీజు రూ.6,300 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 94418 25230ను సంప్రదించాలన్నారు.

టీజీ బ్లాక్ చానెల్‌కు గండి

- వంద ఎకరాల్లో నీట మునిగిన వరి పంట
- ఆందోళనలో రైతులు

రుద్రవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుంగ ప్రధాన కాల్వలో భాగమైన 22వ బ్లాక్ చానెల్‌కు టి. లింగందిన్నె పంట పొలాల సమీపంలో గండి పడినట్లు గురువారం రైతులు తెలిపారు. బ్లాక్ చానెల్‌లో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో వంద ఎకరాల్లో వరి పంట కోతల సమయంలో నీట మునిగిందని రైతులు వాపోయారు. ఒక్కో ఎకరాకు రూ. 30 నుంచి రూ. 35 వేలు పెట్టుబడి పెట్టామని, కోతలకు వీలు లేకుండా గండి నుంచి నీరు ప్రవహిస్తోందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి అంతా నీటి పాలైందని వాపోయారు.

వరి పంట నీటి పాలు

ఐదెకరాల్లో వరి పంట సాగు చేశా. కోతలు సమయంలో పంట నీటి పాలైంది. సాగు కోసం చేసిన ఖర్చంతా వృథా అయింది. మొత్తం వంద ఎకరాల్లో పంట నాశనం అయింది.

- సుభాష్ రైతు, టి. లింగందిన్నె



22వ బ్లాక్‌చానెల్‌కు పడ్డ గండి

పంట అంతా నీటి పాలు

కోతకు వచ్చిన పంట చేతికి వచ్చే సమయంలో నీటి పాలైంది. పెట్టిన పెట్టుబడి వృథా అయిందని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. ఇలాగైతే వ్యవసాయం చేయడం కష్టం.

- సుబ్బయ్య, రైతు, టి. లింగందిన్నె

రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారు

గంగ నీటిలో వరి పంట దెబ్బ తిన్నదని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కోతలు కోసేందుకు కూడా వీలు లేకుండా పొలాల్లోకి గండి నుంచి నీరు పారుతోంది.

- రాముడు, టి. లింగందిన్నె




జిల్లా కేంద్ర గ్రంథాలయం

గ్రంథాలయాలు..

- 65 ఏళ్ల సేవలో కర్నూలు కేంద్ర గ్రంథాలయం
- డిజిటలైజేషన్‌తో పాఠకులకు అన్ని రకాల సేవలు
- నేటి నుంచి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విజ్ఞాన వారధులు

కర్నూలు కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఎంతో కీలక భూమిక పోషించిన ఘనత గ్రంథాలయాలకు దక్కుతుంది. చరిత్రను పరిశీలిస్తే ఆనాడు ఉద్యమకారులకు గ్రంథాలయాలు సమాచార కేంద్రాలుగా ఒకవైపు, అక్షరాస్యతా సాధనకు నిలయాలుగా మరోవైపు నిలిచారు. మారుతున్న కాలంలో సినిమా, టీవీ, మొబైల్ ఫోన్ల ప్రభావం గ్రంథాలయాలపై పడినా, వాటిని అధిగమించి నేటికీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పాఠకులకు విస్తృత స్థాయిలో సేవలు అందిస్తున్నాయి. మేధోవికాసాన్ని పెంపొందించే ఈ పఠనాలయాలను గుర్తిస్తూ ఏటా నవంబరు 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ గ్రంథాలయాల సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. పత్తికొండ, నంద్యాల, చాగలమర్రి తదితర ప్రాంతాల్లో నాటి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిల్చి ఉద్యమ బాటను పట్టించడంలో గ్రంథాలయాలు ప్రముఖంగా నిలిచాయి. స్వాతంత్ర్యానంతరం జిల్లా కేంద్రంలో గ్రంథాలయ సంస్థను, జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని 1959లో స్థాపించారు. పాతనగరంలోని గడియారం ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన ఈ సంస్థ ఆనాడు ఎల్ఎల్ఏ (లోకల్ లైబ్రరీ అథారిటీ) సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయం నడిచేది. కాగా 1972లో ప్రస్తుతం చిదంబరరావు వీధిలో ఉన్న స్వంత భవనంలోకి దీన్ని మార్చారు. ఎల్ఎల్ఏ నుంచి గ్రంథాలయాలు రాష్ట్ర పౌర గ్రంథాలయ సంస్థ కిందికి వెళ్లడంతో జిల్లా గ్రంథాలయ సంస్థగా పేరు మారింది. ఉమ్మడి జిల్లాలో 57 శాఖా గ్రంథాలయాలు, పుస్తక పఠన కేంద్రాలు పాఠకులకు నిత్యం అందుబాటులో ఉంటున్నాయి. ఇక కర్నూలు నగరంలో 65 ఏళ్లుగా జిల్లా కేంద్ర గ్రంథాలయం పాఠకులకు విస్తృత సేవలు అందిస్తోంది. శుక్రవారం నుంచి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయ సంస్థ అందిస్తున్న సేవలపై ప్రత్యేక కథనం.



పాఠకులకు అందుబాటులో లక్షలాది పుస్తకాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ ఉమ్మడి జిల్లాలో కొనసాగుతోంది. కర్నూలు జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీతో కలుపుకొని 58 శాఖా గ్రంథాలయాలు, ఒక గ్రామీణ గ్రంథాలయం, 133 పుస్తక నిక్షిప్త కేంద్రాలు (బీడీసీ)లతో సేవలు అందిస్తున్నాయి. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ ఇతర భాషలకు సంబంధించిన 55,169 పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉంటున్నాయి. ఒక్క జిల్లా కేంద్రంలోనే పత్రికలు, రెఫరెన్స్, లెండింగ్ (పుస్తకాలు ఇంటికి ఇవ్వడం), ఇంటర్‌నెట్, సెర్ఫ్, స్టడీల్యాబ్ వంటి ఆరు విభాగాల్లో సేవలు అందిస్తోంది. జిల్లాలో 21 శాఖా గ్రంథాలయాలు సొంత భవనాల్లో కొనసాగుతుండగా, 22 అద్దె ప్రాతిపదికన, 17 రెంట్ ఫ్రీ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి.

పోటీ పరీక్షలకు కేరాఫ్‌గా



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగ యువత వివిధ పోటీ పరీక్షలు రాసేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో పెట్టారు. యువత పుస్తక పఠనం కోసం ఏసీ స్టడీ హాలు అందుబాటులో ఉండగా, సుమారు వంద మంది కూర్చొని చదువుకునే అవకాశం లైబ్రరీలో ఉంది. అలాగే ఈ స్టడీ హాలులో ఉదయం 8 నుంచీ రాత్రి 8 గంటల వరకు నిరుద్యోగులు చదువుకునే ఏర్పాటు చేశారు. పాఠకుల సౌకర్యార్థం జిల్లా కేంద్రంతోపాటూ కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, గోస్పాడు, ఆదోని, పాణ్యం, ఆలూరు, దొర్నిపాడు, నంద్యాల, డోన్, నందికొట్కూరు శాఖా గ్రంథాలయాల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు.

నేటి నుంచి వారోత్సవాలు ఇలా...

కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య, కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జేసీ నూరుల్ కామర్, మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు కేసీ కల్కూర, కేజీ గంగాధరరెడ్డిలు వారోత్సవాలు ప్రారంభిస్తారు. ఉమ్మడి జిల్లాలోని 57 శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయి. 20 వరకు జరిగే ఈ వారోత్సవాల్లో 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శనలు, అవగాహన సదస్సు, 16న గ్రంథాలయ యోధులపై ప్రముఖుల ప్రసంగాలు, 17న చిత్రలేఖన పోటీలు, కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు ప్రతిభా పోటీలు, ఆటల పోటీలు, 19న క్విజ్ పోటీలు, మహిళా దినోత్సవం, విభిన్న రకాల పోటీలు, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, సామూహిక స్వీయ పఠనం, బహుమతుల ప్రదానం, ముగింపు వేడుకలు జరుగుతాయి.



పుస్తకం హస్తభూషణం కావాలి

పుస్తకం హస్తభూషణం అంటారు. విద్యార్థులు దాన్ని నిజం చేయాలి. చేతిలో మంచి పుస్తకం ఎప్పుడూ ఉండాలి. నేడు సెల్‌ఫోన్ల మాయ నుంచి పిల్లలు బయట పడాలంటే పుస్తకం మాధుర్యం అర్థం చేయించడమే మార్గం. పుస్తకాలు కొనడానికి, చదవడానికి అందరికీ అందుబాటులో ఉండదు. ఆ కొరతను గ్రంథాలయాలు తీరుస్తాయి. బాల సాహిత్యం మొదలు పోటీ పరీక్షల వరకు ప్రముఖ రచయితలు రాసిన అన్ని రకాల సాహిత్య ప్రక్రియలకు చెందిన పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉచితంగా లభిస్తాయి. ఈతరం విద్యార్థులకు అసలు గ్రంథాలయాల గురించి అస్సలు అవగాహన లేదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలల విద్యార్థులను నెలకు ఒకసారి లేదా రెండుసార్లు గ్రంథాలయాలకు తీసుకువచ్చి చదివించడం అలవాటు చేయించాలి.



- డాక్టర్ ఎం.హరికిషన్, బాల సాహిత్య పురస్కార గ్రహీత

చిరుత దాడిలో ఆవు దూడ మృతి

ఆస్పరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొగలగల్‌ గ్రామంలో ఆవుదూడపై చిరుత దాడి చేసి చంపేసింది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. వివరాలివి.. గ్రామానికి చెందిన ఈడిగ అహోబిలం అనే రైతు తన ఆవులను గ్రామ సమీప పొలంలో పశువుల పాకలో కట్టి ఉంచాడు. తెల్లవారుజామున వెళ్లి చూడగా చిరుతపులి దాడి చేసి సగం తిని కళేబరాన్ని వదిలేసింది. ఇది చూసిన రైతు బోరున విలపించాడు. మనుషులపై దాడులు జరగకముందే అటవీశాఖ అధికారులు చిరుతపులిని పట్టుకోవాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం..

- 20 పశువులకు గాయాలు

కొత్తపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో సింగరాజుపల్లె గ్రామంలో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. రాత్రి, పగలు తేడా లేకుండా పశువులపై పిచ్చికుక్క దాడి చేస్తుంది. గురువారం కూడా గ్రామంలో సుమారు 5 పశువులపై దాడి చేసిందని గ్రామస్థులు తెలిపారు. గత నాలుగు రోజుల నుంచి ఓ పిచ్చి కుక్క గ్రామంలో దౌడుదీ ఆవులు, గేదెలు, బర్రెలు ఎద్దులపై దాడి చేసిందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటి వరకు 20 పశువులపై దాడి చేసింది. గత మూడు నెలల క్రితం ఓ ఎద్దును పిచ్చికుక్క కరవడంతో పిచ్చిపట్టి చనిపోయిందని గ్రామస్థులు తెలిపారు. రెండు రోజుల క్రితం 4, బుధవారం రాత్రి 7, గురువారం 5 పశువులపై దాడి చేసిందని గ్రామస్థులు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకుని పిచ్చికుక్క బెడద లేకుండా చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై పశువైద్యాధికారి అశోక్‌ కుమార్‌ను వివరణ కోరగా ప్రస్తుతం మావద్ద 100 డోసుల వ్యాక్సిన్‌ గ్రామానికి పంపించామని ఇవి ఒక్కో పశువుకు మూడు డోసులు వస్తుందని, రెండు డోసులు వేసేందుకు కర్నూలు నుంచి వ్యాక్సిన్‌ తెప్పించి వేయిస్తామని చెప్పారు.

విద్యార్థి గల్లంతు

పాములపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణనగర్‌ గ్రామ శివారులోని ఎస్సార్బీసీ కాలువలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయి విద్యార్థి గల్లంతయ్యాడు. గురువారం పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలివి.. క్రిష్ణనగర్‌ గ్రామానికి చెందిన మొగిలీశ్వరమ్మ, మల్లిక దంపతుల కుమారుడు వీరేశ్‌ పాములపాడు ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఇంటర్మీడియట్‌ సెకండియర్‌ చదువుతున్నాడు. గురువారం క్రిష్ణానగర్‌ గ్రామ శివార్లలోని ఎస్సార్బీసీ కాలువపై ఆడుకోవడానికి మిత్రులతో వెళ్లి కాలువలోకి దిగి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. పోలీసులు, బంధువులు పుట్టి ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

రుద్రవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలూరు గ్రామంలో గురువారం మిద్దె పనిచేస్తూ ప్రమాదవశాత్తు కింద పడి ఈశ్వరయ్య (30) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ఈశ్వరయ్య మందలూరు గ్రామంలో బేల్దారి పని చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆయనను ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు.

అప్పు చెల్లించమన్నందుకు దాడి

కర్నూలు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు చెల్లించాలని ఒత్తిడి చేస్తే.. లీలావతమ్మ అనే మహిళపై దాడి చేశారు. స్థానిక మారుతి టిసికేజీకి చెందిన లీలావతమ్మ వెంకటరమణ కాలనీకి చెందిన శ్రీలక్ష్మి, రామిరెడ్డి, భాగ్యమ్మలకు కొంత అప్పు ఇచ్చింది. ఆ అప్పు తిరిగి చెల్లించాలని కోరినందుకు తనపై దాడి చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్‌ పోలీసులు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

కర్నూలు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో చిన్నబజారి అనే వ్యక్తిపై వేధింపుల కేసు నమోదైంది. చిన్నబజారి తన బంధువులైన ఓ యువతిని వాట్సాప్‌ ద్వారా బెదిరించడంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపినాథ్‌ తెలిపారు.

ఆన్‌లైన్‌ ట్రేడింగ్‌తో రూ.9 లక్షలు మోసం

కర్నూలు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఇంటెలిజెన్స్‌కు చెందిన ఓ ఉద్యోగి ఆన్‌లైన్‌ ట్రేడింగ్‌ ద్వారా రూ.9 లక్షలు మోసపోయాడు. రియాజ్‌ అనే వ్యక్తి ఇంటెలిజెన్స్‌లో అసిస్టెంట్‌ ఎనాలసిస్ట్‌గా పని చేస్తున్నాడు. తనకు వాట్సాప్‌ ద్వారా ఆన్‌లైన్‌ ద్వారా వచ్చిన మెసేజ్‌లతో ఆన్‌లైన్‌ ట్రేడింగ్‌ను నమ్మి నాలుగైదు కంపెనీలలో రూ.9 లక్షల మేర ట్రాన్స్‌ఫర్‌ చేశాడు. ఆ తర్వాత కొద్ది రోజులకు రూ.29 లక్షలు లాభం వచ్చిందని నమ్మించారు. తీరా డబ్బులు అడిగితే.. ఫోన్‌ రిసీవ్‌ చేసుకోకపోవడంతో మోసపోయానని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలి

- గుంతకల్లు రైల్వే డీఎస్‌ఆర్‌పీ శ్రీనివాసాచారి

నంద్యాల నూనెపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు దొంగలు పట్ల జాగ్రత్తగా ఉండాలని గుంతకల్లు రైల్వే డీఎస్‌ఆర్‌పీ (డీఎస్పీ) శ్రీనివాసాచారి అన్నారు. గురువారం ఆయన నంద్యాల రైల్వే పోలీస్‌ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌ కేసులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైల్లో దొంగలు సాధారణ వ్యక్తులతో పాటు తిరుగుతూ చోరీలకు పాల్పడుతుంటారన్నారు. అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని ప్రయాణికులను సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్పీ సర్కిల్‌ ఇన్‌చార్జ్‌ (సీఐ) శ్రీనాథ్‌రెడ్డి, జీన్‌ రైల్వే ఎస్‌ఐ బిందుమాధవి, నంద్యాల రైల్వే ఎస్‌ఐ కుమారి, ఆర్పీఎఫ్‌ ఏపీఎఫ్‌ (సీఐ) రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్‌ లైసెన్సు ఫీజు వసూళ్ల నిర్లక్ష్యంపై విజిలెన్స్‌ ఆరా


కర్నూలు న్యూసిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని దుస్తుల దుకాణాలు, రెడిమేడ్‌, దుకాణాలు, హోటల్స్‌, బార్‌ అండ్‌ రెస్టారెంట్లతో పాటు ఇతర వ్యాపారులకు సంబంధించి ట్రేడ్‌ లైసెన్సు రెన్యువల్‌ ఫీజులపై విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు.



2018-2019 నుంచి 2020-2021 వరకు సుమారు రూ.2,29,64,990, 2021-2022 నుంచి 2024-2025 వరకు సుమారు రూ.3,09,58,449 పెండింగ్‌ ఉన్నట్లు తమ విచారణలో వెల్లడైందని అధికారులు తెలిపారు. ఈ మేరకు విజిలెన్స్‌ డీఎస్పీ కార్యాలయానికి సమాచారం పంపించినట్లు తెలిపారు. మొత్తం 2018-2019 నుంచి 2024-2025 వరకు రూ.5,39,23,439 పెండింగ్‌ ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు మొత్తం పెండింగ్‌లో నగర పాలక అధికారులు కేవలం రూ.1,37,74,450 మాత్రమే వసూలు చేసినట్లు వివరాలు సమర్పించారని తెలిపారు. తక్షణమే మిగిలిన రెన్యువల్‌ వివరాలు పంపాలని విజిలెన్స్‌ అధికారులు లేఖ రాశారు.

మధుమేహం.. అప్రమత్తం

- జిల్లాలో పెరుగుతున్న షుగర్‌ బాధితులు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు
- నేడు ప్రపంచ మధుమేహ నివారణ దినం



లక్షణాలు
- తరచుగా మూత్రం పోవడం
- అధిక దాహం.. అధిక ఆకలి
- చూపు మందగించడం
- బరువు తగ్గడం, గాయాలు మానకపోవడం

- తినకముందు 100 లోపు: మన దేశంలో చక్కెరస్థాయి వరగడుపున తినక ముందు 100లోపు ఉంటే మధుమేహం లేనట్లు భావించాలి.
- తిన్న రెండు గంటల తర్వాత చక్కెర స్థాయి 200 దాటితే షుగర్‌ ఉన్నట్లు నిర్ధారించవచ్చు.

కర్నూలు హాస్పిటల్‌, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'మా ఇంట్లో ఎవ్వరికీ షుగర్‌ వ్యాధి లేదు.. మేము కష్టపడే వాళ్లం.. మాలాంటి వాళ్లకు రాదు..' అనే మాటలు చెల్లవిక. ఇప్పుడు మధుమేహం సర్వసాధారణ వ్యాధి. ఎవరికైనా వస్తుంది. ప్రతి నలుగురిలో ఒకరు మధుమేహం బారిన పడుతున్నారు. ఒకప్పుడు పట్టణాల్లో పరిమితమైన ఈ వ్యాధి ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. పెద్ద తేడా లేకుండా అందరికీ వస్తోంది. మారిన ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిళ్లు, జీవనశైలిలో మార్పుల వల్ల మధుమేహం బారిన పడుతున్నారు. నవంబరు 14 వరల్డ్‌ డయాబెటిస్‌ డే సందర్భంగా ఇంటర్నేషనల్‌ డయాబెటిస్‌ ఫౌండేషన్‌ ఈ ఏడాది మధుమేహం-శ్రేయస్సు అనే నినాదాన్ని ఇచ్చింది.

మధుమేహం ప్రమాదకరమైన వ్యాధి. అనేక ఇతర వ్యాధులకు కారణమవుతుందని అంటారు. ఇందులో కొన్ని రకాలు ఉన్నాయి.

టైప్‌-01: ఆటోఇమ్యూన్‌ కారణంగా ఇన్సులిన్‌ లోపం వల్ల వస్తుంది.

టైప్‌-02: ఇన్సులిన్‌ నిరోధకత, జీవనశైలి కారణంగా గర్భధారణ మధుమేహం, గర్భధారణ సమయంలో వస్తుంది.

ఇతర రకాలు: జన్యు లేదా మందుల కారణంగా, ఊబకాయం వల్ల, వ్యాయామం లేకపోవడం, జంక్‌ఫుడ్‌, ఒత్తిడి, పొగ తాగడం, మద్యం సేవించడం వల్ల షుగర్‌ వస్తుంది.

పట్టణాల్లో ఎక్కువ..

జిల్లాలో షుగర్‌ వ్యాధి బాధితులు పట్టణాల్లో అధికంగా ఉన్నారు. పట్టణాల్లో 20 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 15 మంది బాధితులు నమోదవుతున్నారు. అసలు ఈ సమస్య ఉన్నట్లు తెలియని వారే ఎక్కువ మంది. ఏదైనా అనారోగ్య సమస్యతో వచ్చినప్పుడు, ఆపరేషన్‌ చేసే సమయంలో రక్తపరీక్షలు చేస్తున్నప్పుడు మధుమేహం ఉన్నట్లు బయటపడుతుంది. జిల్లాలో పీడియాట్రిక్‌తో బాధపడుతున్న వారు మరో 10 శాతం మంది ఉన్నారు. కర్నూలు జిల్లాలో 19.54 లక్షల జనాభా ఉండగా.. గత సెప్టెంబరులో ఎన్‌సీడీ 4.0 పరీక్షలు నిర్వహించగా.. 149 మందికి మధుమేహం ఉన్నట్లు గుర్తించారు.

ఈ వయసులో అధికం..

30-45 ఏళ్ల వయస్సులో ఉన్న వారిలో మధుమేహం ఇటీవల కాలంలో అధికంగా నమోదవుతుంది. ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ మెడికల్‌ రీసెర్చ్‌ ప్రకారం మన జనాభాలో ముఖ్యంగా యువతలో గతం కంటే ఇప్పుడు పది శాతం మధుమేహం పెరుగుదల కనిపిస్తుంది. పిల్లల్లో సైతం పెరగడం ఆందోళన కలిగిస్తున్నది.

కర్నూలు జీజీహెచ్‌కు క్యూ..

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో షుగర్‌ బాధితుల కోసం ప్రత్యేక ఎండోక్రైనాలజీ విభాగం ఉంది. ఈ విభాగానికి ప్రొఫెసర్‌ అండ్‌ హెచ్‌వోడీగా డా.పి. శ్రీనివాసులు, అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డా.పి. రాధారాణి, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా డా. సయ్యద్‌ హలీమ్‌తో పాటు రెండు డీఎం, పీజీ సీట్లు ఉన్నాయి. వారంలో ఓపీ ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఉంటుంది. ప్రతి ఓపీకి 250 నుంచి 300 మంది రోగులు వస్తుంటారు.



తెల్ల అన్నం మహా ప్రమాదం

వరి అన్నం తింటే చక్కెర స్థాయిలు విపరీతంగా పెరుగుతాయి. చిరుధాన్యాలు, కొర్రలు, దంపుడు బియ్యం, జొన్నరొట్టె తినాలి. ఆపిల్‌, బొప్పాయి, దానిమ్మ, చీనిపండ్లు తినవచ్చు. వ్యాధిగ్రస్థులు ప్రతిరోజు 45 నిమిషాలు వ్యాయామం చేయాలి. లేదా నడవాలి. ఆస్టియో బ్లాస్ట్‌ కణాలు సరిగ్గా పని చేయక, ఎముకలు బలహీన పడతాయి. కర్నూలు జీజీహెచ్‌లో డెక్సాస్కాన్‌ ద్వారా ఎముకల సాంద్రతను తెలుసుకుని చికిత్స చేయించుకోవాలి. - డా.పి. శ్రీనివాసులు, ప్రొఫెసర్‌ అండ్‌ హెచ్‌వోడీ, ఎండోక్రైనాలజీ విభాగం, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి



ప్రమాదాన్ని గుర్తించడం లేదు

మగ వ్యాధిగ్రస్థులు పరిస్థితి విషమించే వరకు గుర్తించలేకపోతున్నారు. ఇటీవల 14 సంవత్సరాల పిల్లలు ఊబకాయం వల్ల షుగర్‌ వ్యాధి లక్షణాలతో ఆసుపత్రికి వస్తున్నారు. పిల్లల్లో వ్యాయామం తగ్గడం, టీవీ, సెల్‌ ఫోన్ల ప్రభావంతో వ్యాధి గురవుతున్నారు. - డా.పి. రాధారాణి, అసోసియేట్‌ ప్రొఫెసర్‌, ఎండోక్రైనాలజీ విభాగం, కర్నూలు జీజీహెచ్‌



కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలి

మధుమేహంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా పనివేళల్లో ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. కొత్తగా వచ్చిన టెక్నాలజీని ఉపయోగించుకుని షుగర్‌ వ్యాధి స్థాయిని తెలుసుకుని కంట్రోల్‌లో ఉంచుకోవాలి. పని ఒత్తిడిలో ఉండే వారు కొత్తగా చేతికి కట్టుకునే వాచ్‌లో మన ఆరోగ్యం హెల్త్‌ కండిషన్‌ వివరాలు తెలుసుకుని పని టైంలో కూడా జాగ్రత్త పడాలి. - డా.బి. భరత్‌, ఎండోక్రైనాలజిస్టు, భరత్‌ హాస్పిటల్‌, కర్నూలు

జోరుగా శనగ సాగు

- అదును దాటుతున్నా శనగ వైపే మొగ్గు
- జిల్లా సాధారణ సాగు 1.50 లక్షల ఎకరాలు
- గత ఏడాది 1.30 లక్షల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది 1.40 లక్షల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా



కొలిమిగుండ్ల మండలంలో సాగవుతున్న శనగ పంట

కొలిమిగుండ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాలలో శనగ సాగు జోరుగా సాగుతోంది. మొంథా తుపాన్‌ అనంతరం వానలు కాస్త తగ్గడంతో పొలాలు ఇప్పుడిప్పుడే తడి ఆరుతున్నాయి. రైతులు శనగ సాగు చేయడానికి సిద్ధమయ్యారు. అదును దాటుతున్నా అధిక సంఖ్యలో రైతులు పప్పు శనగ సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాలతో పాటు, కోవెలకుంట్ల, సంజామల, బనగానపల్లె, అవుకు తదితర ప్రాంతాలతో పాటు జిల్లా వ్యాప్తంగా రైతులు శనగ సాగును ఆరంభించారు. జిల్లాలో శనగ సాధారణ సాగు విస్తీర్ణం 1.50 లక్షల ఎకరాలు కాగా, గత ఏడాది 1.30 లక్షల ఎకరాల్లో అన్నదాతలు శనగ సాగు చేశారు. అయితే ఈ ఏడాది శనగ సాగు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. సుమారు 1.40 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. అయితే భారీ వర్షాలు మొంథా తుపాన్‌ ప్రభావంతో శనగ సాగు భారీగా తగ్గే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. రబీ శనగ సాగుకు 15వ తేదీతో గడువు ముగుస్తుంది. అయినా రైతులు శనగ సాగు చేయడానికే ఆసక్తి చూపుతున్నారు. గత నాలుగు రోజులుగా తడి ఆరిన పొలాల్లో విస్తారంగా శనగ సాగు చేస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా పొలాల్లో అన్నదాతల కోలాహలం కనిపిస్తోంది. చాలా ఏళ్లుగా జిల్లాలో ముఖ్యంగా కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌ డివిజన్‌లో రబీలో శనగ సాగుపైనే ఆసక్తి పెంచుకున్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి

సాగు గడువు ముగుస్తున్నందున వల్ల రైతులు శనగకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటల వైపు మొగ్గడం మంచిదని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఇతర పంటలు సాగు చేయడానికి అవకాశం ఉందని అంటున్నారు.



ఆరుతడి పంటలు సాగు చేయండి

రైతులు ఆరుతడి పంటలు సాగు చేయడం మంచిది. కొర్ర, కుసుమ, మినుము లాంటి పంటలు సాగు చేస్తే పెట్టుబడి తగ్గడంతో పాటు, మంచి లాభాలు ఆర్జించవచ్చు. - శారదాదేవి, వ్యవసాయ అధికారి



10 ఎకరాల్లో శనగ సాగు చేస్తున్నాను

చాలా ఏళ్లుగా రబీలో శనగ పంటనే సాగు చేస్తున్నాను. వేరే పంట అలవాటు లేదు. ఈసారి పదెకరాల్లో శనగ సాగు చేస్తున్నాను. -రాజేశ్వరరెడ్డి, రైతు నందిపాడు

చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్‌ డాక్టర్‌ సిరి



కర్నూలు కలెక్టరేట్‌, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి రోజూ చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్‌ డాక్టర్‌ ఏ.సిరి ఈవోఆర్డీలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌ నుంచి ఎంపీడీవోలు, మున్సిపల్‌ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఇంజనీర్లు, డివిజనల్‌ డెవలప్‌మెంట్‌ ఆఫీసర్లు, డీపీవో, డివిజనల్‌ పంచాయతీ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండకూడదని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న కౌశలం, ఈకేవైసీ, బయోమెట్రిక్‌ అప్‌డేషన్‌, వాహన్‌ ఆధార్‌ సీడింగ్‌ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్‌ కమిషనర్లను ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎస్‌ఈ మనోహర్‌, హౌసింగ్‌ పీడీ చిరంజీవి, డీపీవో భాస్కర్‌, పబ్లిక్‌ హెల్త్‌ ఈఈ చంద్రమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కడప సెంట్రల్‌ జైలులో టీడీపీ నేత మృతి

- హత్య కేసులో జీవిత ఖైదుగా అరికట్ల చిన్న సుంకిరెడ్డి
- ఆరేళ్లపాటు కోవెలకుంట్ల మార్కెట్‌ యార్డు చైర్మన్‌గా సేవలు
- శిక్ష అనుభవిస్తూ గుండెపోటుతో మృతి



కోవెలకుంట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో కడప సెంట్రల్‌ జైలులో జీవితఖైదు అనుభవిస్తున్న కోవెలకుంట్ల మండలం భీమునిపాడుకు చెందిన మాజీ మార్కెట్‌ యార్డు చైర్మన్‌ అరికట్ల చిన్న సుంకిరెడ్డి గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. అరికట్ల చిన్న సుంకిరెడ్డి (71) వృద్ధాప్యం రీత్యా అనారోగ్యంతో బాధపడుతూ ఉండటంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు, టీడీపీ అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో భీమునిపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా భీమునిపాడు ఫ్యాక్షన్‌ నేపథ్యం ఉన్న గ్రామం కావడంతో సీఐ హనుమంతనాయక్‌ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. భీమునిపాడుకు చెందిన టీడీపీ సీనియర్‌ నాయకుడు అరికట్ల చిన్న సుంకిరెడ్డి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. టీడీపీకి సుంకిరెడ్డి అందించిన సేవలు ఎనలేనివని, ఆయన మరణం తీరని లోటు అన్నారు. సుంకిరెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున, వ్యక్తిగతంగా తాను అన్నివిధాలా తోడుగా ఉంటానని మంత్రి భరోసానిచ్చారు.

ఆధిపత్యం కోసమే ఫ్యాక్షన్‌

భీమునిపాడులో అరికట్ల పెద్ద సుంకిరెడ్డి, అరికట్ల చిన్న సుంకిరెడ్డి, అరికట్ల బాల సుంకిరెడ్డి ఉన్నారు. వీరికి సమీప బంధువు దుత్తల నరసింహారెడ్డి కూడా గ్రామస్థుడే. అయితే అరికట్ల చిన్నసుంకిరెడ్డి టీడీపీ నాయకుడిగా, దుత్తల నరసింహారెడ్డి వైసీపీ నాయకుడిగా గ్రామంలో పార్టీ కార్యకలాపాలు చూస్తుండేవారు. గ్రామంలోని శ్రీరామ ఆలయం, మాన్యం భూమి కౌలుకు తీసుకునే విషయంలో ఇద్దరికీ గొడవలు రావడంతో వారి మధ్య ఫ్యాక్షన్‌ తలెత్తింది. దుత్తల నరసింహారెడ్డి గ్రామంలో ఆధిపత్యం కోసం టీడీపీకి చెందిన అరికట్ల బాల సుంకిరెడ్డిని 27-1-2000 సంవత్సరంలో హత్య చేశాడు. ఆ కేసులో దుత్తల నరసింహారెడ్డికి 2005లో ఏడు సంవత్సరాల జైలుశిక్ష పడింది. అయితే దుత్తల నరసింహారెడ్డి 2008లో హైకోర్టులో కేసు కొట్టివేయించుకుని బయటకి వచ్చి కొలిమిగుండ్ల మండలం ఎర్రగుడిలో ఉండేవాడు. 2010 సంవత్సరంలో అప్పటి బనగానపల్లె వైసీపీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో భీమునిపాడుకు చేరుకుని రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ గ్రామంలో ఆధిపత్యం కోసం ప్రయత్నించేవాడు

ఇదిలా ఉండగా అరికట్ల చిన్న సుంకిరెడ్డి 1993 నుండి 1996 వరకు కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్‌గా పనిచేశారు. అలాగే రెండోసారి 2010 నుండి 2013 వరకు కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు చైర్మన్‌గా పనిచేసి ఈ ప్రాంత ప్రజలకు రైతులకు సేవలందించారు. అయితే గ్రామాధిపత్యం కోసం మరోవైపు దుత్తల నరసింహారెడ్డి పోరాటం కొనసాగిస్తున్నే ఉన్నారు. ఈ తరుణంలో టీడీపీకి చెందిన అరికట్ల చిన్న సుంకిరెడ్డి అతని కుమారుడు సురేంద్రరెడ్డి మరికొందరితో కలిసి 10-5-2013న రేవనూరు పోలీసుస్టేషన్‌ పరిధిలోని కలుగొట్ల ఆర్‌అండ్‌బీ రహదారిలో ప్రత్యర్థి దుత్తల నరసింహారెడ్డిని హత్య చేశారు. ఆ కేసులో వారికి జీవితఖైదు శిక్ష పడింది. అరికట్ల చిన్న సుంకిరెడ్డి, అరికట్ల సురేంద్ర రెడ్డి, సురేశ్‌రెడ్డి, మాల బాలస్వామి, మాదిగ సుబ్బరాయుడు కడప సెంట్రల్‌ జైల్లో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్నారు. వారిలో ఒకరైన అరికట్ల చిన్న సుంకిరెడ్డి గురువారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి మృత దేహాన్ని అంత్యక్రియల నిమిత్తం భీమునిపాడుకు తీసుకువచ్చారు.

రైతులు దళారులను నమ్మొద్దు..

కర్నూలు అగ్రికల్చర్‌, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం రైతుబజార్లను ఏర్పాటు చేసిందని అందువల్ల పొలాల్లో వారు పండించిన కూరగాయలను దళారులకు అమ్మి నష్టపోకుండా రైతుబజార్లకు నేరుగా తీసుకువచ్చి అమ్ముకోవాలని సీకాంపు రైతుబజార్‌ హార్టికల్చర్‌ అధికారి శివకుమార్‌ కోరారు. గురువారం కర్నూలు నగర పరిధిలోని బూసాపేట గర్‌, నందనపల్లె, పడిదెంపాడు, మిలిటరీ కాలనీతో పాటు తదితర గ్రామాల్లో సీకాంపు రైతుబజార్‌ హార్టికల్చర్‌ అధికారి శివకుమార్‌ పొలాల్లో రైతులు పండించిన పంటలను పరిశీలించారు. దళారులు గ్రామాలకే వెళ్లి రైతులను మోసపూరిత మాటలతో నమ్మించి తక్కువ ధరకే కూరగాయలను కొనుగోలు చేస్తున్నారని వాటిని రెట్టింపు ధరకు రైతుబజార్లలో వినియోగదారులకు అంటగడుతున్నారని దీని వల్ల రైతులు, ప్రజలు నష్టపోతున్నారన్నారు. రైతుబజార్లలో నాణ్యమైన కూరగాయలను తక్కువ ధరకే ప్రజలకు అందిస్తున్నామన్నారు.

అపరిశుభ్రత ఉండరాదు



పెంచికలపాడులో పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

• జడ్పీ సీఈవో నాసర రెడ్డి

గూడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అపరిశుభ్రత ఉండరాదని జడ్పీ సీఈవో నాసర రెడ్డి ఆదేశించారు. గురువారం పెంచికలపాడు గ్రామంలో ఆయన పర్యటించారు. ప్రధాన రహదారిలో మురుగును చూసి, డ్రైనేజీ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చెత్త సేకరణను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు

డ్రైనేజీ నిర్మాణాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

మండలంలోని పెంచికలపాడు గ్రామంలో చేస్తున్న డ్రైనేజీ పనులను స్థానికులు అడ్డుకున్నారు. జడ్పీ సీఈవో ఆదేశాలమేరకు ఎక్స్‌కవేటర్ సాయంతో తవ్వి వదిలేస్తున్నారని, సీసీ నిర్మాణం చేపట్టాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి సౌందర్య మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

వారోత్సవాలను విజయవంతం చేద్దాం

ఓర్వకల్లు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని లైబ్రేరియన్ హనుమే నాయక్ కోరారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 18న విద్యార్థులకు పోటీలు, 19న మహిళా సాధికారత పై చర్చ, 20న అక్షరాస్యత దినోత్సవం నిర్వహిస్తామన్నార

కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ కర్నూలు కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించనున్నారు. 2015లో ఏర్పడిన అసోసియేషన్ ప్రస్తుతం ఇటీవల రద్దు చేయడంతో కొందరు మరో అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. అయితే రెండు అసోసియేషన్లు కాకుండ ఒకే అసోసియేషన్ కింద ఉంటేనే న్యాయం జరుగుతుందని కాంట్రాక్టర్లు భావిస్తున్నారు.

చలో ఢిల్లీకి తరలిరావాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ తలపెట్టిన చలో ఢిల్లీకి తరలివారాలని నాయకుడు విజయ్ భాస్కర్ కోరారు. గురువారం అంబేద్కర్ భవన్‌లో కరపత్రాలను విడుదల చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడి దళితుల జాతిపై దాడిగా భావిస్తున్నామన్నారు.

వేగంగా విస్తరణ

• మెడికల్ కళాశాల వద్ద తొలగనున్న ట్రాఫిక్ కష్టాలు



రహదారి నిర్మాణానికి సిద్ధమైన స్థలం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కర్నూలు వైద్య కళాశాల వద్ద రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల తరబడి కళాశాల మలుపు వద్ద ట్రాఫిక్ జాంలతో ప్రమాదాలు చోటుచేసుకుంటుడటంతో మంత్రి టీజీ భరత్ జోక్యంతో దుకాణాలు తొలగించి నిర్మాస్తున్నారు. ఇటీవలే దుకాణదారులను స్వచ్ఛందంగా షాపులను తొలగించుకున్న విషయం విదితమే. రోడ్డు, డ్రైనేజీ పనులు రెండు రోజుల్లోనే పూర్తయవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

ఎన్జీవోల సభ్యత్వ నమోదు



సభ్యత్వం అందజేస్తున్న ఎన్జీవోస్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేన్ నాయకుల సభ్యత్వాన్ని ప్రారంభించారు. జేడీఏ వరలక్ష్మికి, డీడీఏ వెంకటేశ్వరరెడ్డ, ఆత్మ పీడీ శ్రీలతకి వ్యవసాయాధికారులకు వ్యవసాయ శాఖ నాన్ గెజిటెడ్ సిబ్బందికి ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు చేపట్టారు. రవి ప్రకాష్, ఎంసీ కాశన్న, కేసీహెచ్ కృష్ణుడు, టైపిస్టు శంకర్ నాయక్ పాల్గొన్నారు.

రహదారిని విస్తరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సి.బెళగల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కొత్తబస్టాండు అవరణంలో ధర్నా నిర్వహించారు. రహదారిని 40 అడుగులకు విస్తరించాలని,ప్రరజలు సహకరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రంఅందజేశారు. సీపిఎం నాయకుడు మోహన్ మాట్లాడుతూ గూడురు నుంచి ఎమ్మిగనూరు వరకు రహదారిని ఆక్రమించి నిర్మించిన గృహలను తొలగించి, 40 అడుగులకు విస్తరించాలన్నారు. మద్దిలేటి, రాజు, రంగన్న పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ న్నారు. గురువారం బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలల అవగాహన నిర్వహించారు. యువత మత్తు పదార్థాలతో తమ జీవితాలను చేతులారా నాశనం చేసుకుంటున్నారు. ఈగల్ టీమ్ సభ్యులు రమేష్, అధ్యాపకులు మల్లికార్జున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బి.క్యాంపు సెక్షన్ పరిధిలో మరమ్మతుల చేస్తున్నందున ఉదయం 7 నుంచి 9 గంటల వరకు మహాలక్ష్మీనగర్, సోమప్పకాలనీ, ఎన్‌సీసీ క్యాంటీన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డివిజన్ ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మౌర్యాఇన్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

కోడుమూరు రూరల్, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ట్రైనీ ఎస్ఐ మణికంఠ తెలిపారు. వివరాల మేరకు.. ఎస్ఐ మాట్లాడుతూ హంద్రీనది నుంచి క్రిష్ణగిరి మండలానికి ఇసుక తరలిస్తుండగా కృష్ణాపురం వీఆర్వో సూరిబాబు నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. మరో 2 ఇసుక ట్రాక్టర్లు తప్పించుకపోయాయి. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

సి.బెళగల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎపీఎం రమేష్ అన్నారు. గురువారం వెలుగు కార్యాలయం మాట్లాడుతూ రుణాలను సకాలంలో చెల్లించి, బ్యాంకుల అభివృద్ధికి తోడ్ప డాలన్నారు. కోళ్ళ పెంపకం, బుట్టల, అల్లికలు, ఫినాయిల్ తయారీ, బర్రెలు, గొర్రెల పెంపకం, కిరాణం, కూరగాయల వ్యాపారం, పండ్లవ్యాపారం చేసి, రుణాలను సకాలంలో చెల్లిస్తే సున్నా వడ్డీ వర్తిస్తుందన్నారు. కెనరా బ్యాంక్ మేనేజర్ ప్రసంగి ఉన్నారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలి

• నగర పాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్



కర్నూలు న్యూసిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని విద్యాసంస్థలు, ఆసుపత్రుల వద్ద వీధి కుక్కలు రాకుండా ప్రహరీ, ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవలని కమిషనర్ విశ్వనాథ్ సూచించారు. ఈమేరకు సంభందిత యజమానులకు నోటీసులు జారీ చేశారు. బస్టాండు, రైల్వే స్టేషన్లు, క్రీడా మైదానాల్లో కుక్కలు లోపలికి రాకుండా చూసుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనిమల్ బర్త్ కంట్రోల్‌ను అమలు పరిచేందుకు అనిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్ 2023నుజారీ చేసిందన్నారు. వీధి కుక్కలను పట్టుకుని కు.ని. శస్త్రచకిత్స చేసి, యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ వేసి, చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ మహాసభలు ఈ నెల 28, 29 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహిచనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫి తెలిపారు. గురువారం పోస్టర్లను విడుదల చేశారు. సోమశేఖర్, సాహిద్, మధ్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కోడుమూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ వీధికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు కేసు నమోదు అయ్యింది. కేసు వివరాలివి. ఓ వీధికి చెందిన యువకుడికి పొరుగు రాష్ట్రానికి చెందిన యువతితో మూడేళ్ల క్రితం వివాహమైంది. యువతి మరో వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతుందనే అనుమానంతో కుటుంబసభ్యుల మధ్య పంచాయితీ జరిగింది. పంచాయితీలో యువతిని మందలించారు. అనంతరం యువతిని బంధువుల దగ్గర సమీప గ్రామంలో ఉంచారు. అయితే ఈనెల 11న సాయంత్రం బహిర్భూమికి అని వెళ్లిన యువతి తిరిగి రాలేదు. భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మణికంఠ తెలిపారు.

పౌష్టిహాకారం అందజేయాలి

సి. బెళగల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలని అంగన్‌వాడీ సూపవైజర్ రాజమ్మ సూచించారు. గురువారం కొత్తకోట, శింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రజలు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు?

కర్నూలు న్యూసిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ల బదిలీకి రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఓ కార్పొరేటర్ భర్త పట్టుబట్టి తన డివిజన్‌కు తాను సూచించిన ఇన్‌స్పెక్టర్‌నే నియమించాలని కమిషనర్‌పై ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ట్రేడ్ లైసెన్సు వసూళ్లలో నిక్కచ్చిగా ఉండటంతో, సదరు కార్పొరేటర్ భర్త బంధువు దుకాణానికి రూ.39వేలకుపైగా పెండింగ్ ఉండటంతో ఉంది. దీనిని చెల్లించాలని ప్రస్తుత శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంటనే చెల్లించాలని ఒత్తిడి తీసుకురావడంతో ఇలా చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ భర్త పట్టుబట్టడంతో దాదాపు ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది.

హామీలను నెరవేరుస్తాం

• కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు

కోడుమూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం స్నేహ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గంలోని మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేపట్టారు. కేడీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి సీఎం చంద్రబాబుకు నియోజకవర్గంలోని సమస్యలను వివరించామన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. గుర్తు చేశారు. సి.బెళగల్ మండలంలో రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ గెలుపుకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, సురేష్, చంద్రశేఖర్, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధే ధ్యేయం

• పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధే ధ్యేయమని



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి తెలిపారు. గురువారం 20వ వార్డులోని కాలనీల్లో రూ.1.36 చేయనున్న అభివృద్ధి పనులకు కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. అర్బన్ వార్డులను స్మార్ట్ వార్డులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం టెలికాంనగర్ 51, 25 సచివాలయాలను తనిఖీ చేశారు. ఉద్యోగులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బి.నాగిరెడ్డి, శ్రీనివాసరావు, శ్రీకాంత్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ఇక నుంచి పెద్దాసుపత్రిలో తనిఖీలు

• సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ఆసుపత్రిలో అకస్మిక తనిఖీలు చేస్తామని, విధి నర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం ధన్వంతరీ హాలులో ఎన్టీఆర్ వైద్యసేవలపై సమీక్ష నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కేసుల ప్రీ-ఆథరైజేషన్ కేసులను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమయపాలన పాటించాలని, టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు.

ఈ సమీక్షలో ఆర్ఎంవో డా.వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.పద్మజ పాల్గొన్నారు.

సీపీఐ కార్యదర్శిని కలిసిన న్యాయవాదులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్యను భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) నాయకులు కలిసారు. గురువారం సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.రంగనాథ్, జిల్లా కోశాధికారి పి.దస్తగిరితో కలిసి ఈశ్వరయ్యను అభినందించారు. జి.శ్రీనివాసులు, బద్దల్ లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.



పాఠశాల విద్యార్థులతో మహ్మద్ ఇక్బాల్

కుట్టు మిషన్లు పంపిణీ

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో విశ్రాంత రాయలసీమ ఐజీ షేక్ మహ్మద్ ఇక్బాల్ రెండు ఎంబ్రాయిడరీ, 4 కుట్టు మిషన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. హెచ్ఎం, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యులు గుడిపల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా కలెక్టర్‌ను ఇక్బాల్ కలిశారు. పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ స్కూల్స్, హాస్టల్స్‌లో ఉన్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు

వృద్ధులకు స్వెట్టర్లు పంపిణీ



స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

కర్నూలు కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయం ఆవరణలో గురువారం వృద్ధులకు స్వెట్టర్లు పంపిణీ చేశారు. రోజా మహిళా సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురారి శంకరప్ప స్వాములు, ఎల్లాగౌడ్, నరసయ్య, రామకృష్ణ, రాముడు, వెంకటరాముడు, గోవింద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి పనులు

• ఎంపీడీవో రాణెమ్మ

సి.బెళగల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాబుకార్డు ఉన్న వాళ్ళందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. గురువారం బురాన్‌దొడ్డి, మారందొడ్డి, బ్యాళోళి గ్రామాల్లో కూలీలతో మాట్లాడుతూ దూరప్రాంతాలకు వలస వెల్లరాదన్నారు. వలసలు వెళ్లేవారికి ప్రభుత్వం పథకాలు వర్తించవని తెలిపారు. పొదుపు ఎపీఎం రమేష్, ఉపాది ఎపీవో రామన్న, ఈసీ రంగస్వామి ఉపాది సిబ్బంది ఉన్నారు.

16న కురువల కార్తీక మాస వనభోజన మహోత్సవం



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 16వ తేదీన పట్టణంలోని టీబీఎల్ కాలనీ బీరప్ప గుడిలో కురువల కార్తీకమాస వన భోజన మహోత్సవం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున తెలిపారు. గురువారం ఎంపీ బస్తిపాటి నాగరాజు, కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్పలు కరపత్రాలను విడుదల చేశారు. కురువల ఆత్మీయతను పెంచేందుకు వన భోజన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కొత్తగా డీఎస్సీ పోస్టులు పొందిన వారికి సన్మానిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఎంపీ బస్తిపాటి నాగరాజు. కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రతోపాటు రాష్ట్ర నాయకులుపాల్గొంటారన్నారు. చాగి మల్లికార్జున, హనుమంతు, రామకృష్ణ పాల్గొన్నారు.

షష్టి ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న నిర్వాహకులు

మద్దికెర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దమ్మకుంట గ్రామ సమీపాన వెలసిన శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరిగే సుబ్రహ్మణ్య స్వామి షష్టి ఉత్సవాలకు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి హాజరు కావాలని గురువారం ఆలయ నిర్వహకులు విజయప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి ఆహ్వానించి స్వామివారి చిత్రపటాన్ని, షీల్డ్‌ను అందజేశారు. కలెక్టర్ షష్టి ఉత్సవాలకు సహకారం అందిస్తామని తెలిపారన్నారు.

ప్రైవేటీకరణను వ్యతిరేకించండి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మార్కెట్ యార్డ్‌లో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. పేద ప్రజలకు ఉచిత కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను నిర్మాణం చేపడితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో కొనసాగిం చేందుకు చూస్తోందన్నారు. చంద్రకాంత్ రెడ్డి, ఫయాజ్ అహ్మద్, లోకేశ్వరి, గౌస్, నరసింహులు, పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



ఎగ్జామ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఉప కమిషనర్ గోవిందనాయక్

పత్తికొండ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా పరీక్షల విభాగపు ఉప కమిషనర్ గోవిందనాయక్ సూచించారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్‌జోసెఫ్ పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లలో నిర్వహించే పదో తరగతి పరీక్షా కేంద్రాల సదుపాయాలను పరిశీలించి, అక్కడున్న ఉపాధ్యాయులతో సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల్లో ఉన్న ఇతర అలవాట్ల వైపు మొగ్గు చూపకుండా పూర్తిగా పరీక్షలపై దృష్టి పెట్టేలా వారికి మార్గనిర్దేశనం చేయాలన్నారు. ఎంఈఓ రమేష్, ఎగ్జామినేషన్ సీనియర్ అసిస్టెంట్ ఖాన్, సీఆర్‌సీ తులశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

తుగ్గలి: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాదించేలా విద్యార్థులకు విద్యాబోధన చేయాలని ఎగ్జామినేషన్స్ ఆఫ్ అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన తుగ్గలిలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. పరీక్షలంటే భయపడకుండా రాయాలన్నారు. ముందుగా ప్రతి సబ్జెక్టును అర్థం చేసుకుని చదివితే మంచి ఫలితాలు రావడంతో పాటు భవిష్యత్తులో పోటీ పరీక్షలకు కూడా ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రధానోపాధ్యాయులు అగస్టీన్, ఉపాధ్యాయులు చందూ నాయక్ పాల్గొన్నారు.

'టీడీపీ బలోపేతానికి కృషి'

మద్దికెర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):మండలంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తూ అందరినీ కలుపుకుని పోతానని మండల టీడీపీ ఉపాధ్యక్షులు మెడికల్ తిమ్మప్ప అన్నారు. మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన మెడికల్ తిమ్మప్ప మండల టీడీపీ ఉపాధ్యక్షులుగా ఎంపిక కావడంతో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

సొసైటీ చైర్మన్‌గా రత్నమ్మ

ఆస్పరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆస్పరి సింగిల్ విండో చైర్మన్‌గా మేడబోయిన రత్నమ్మ, డైరెక్టర్లుగా ముత్తుకూరు కురువ మల్లికార్జున, ఆస్పరి గ్రామానికి చెందిన కె.సుంకన్నలు గురువారం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సీఎంకు, లోకేష్, వైకుంఠం జ్యోతిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

- స్థానిక ఎన్నికల్లో పార్టీ సత్తా చాటడానికి అంకితభావంతో కృషి చేయాలి
- బూత్ క్లస్టర్ కమిటీ సభ్యులకు టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు దిశా నిర్దేశం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు



జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

ఆదోని, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రతిఒక్కరూ ఒక సైనికుడిలా క్రమశిక్షణతో, అంకితభావంతో పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని టీడీపీ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు పిలుపునిచ్చారు. టీడీపీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బూత్ క్లస్టర్ యూనిట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, అబ్జర్వర్ ధర్మవరపు సుబ్బారెడ్డి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం మాట్లాడారు. ప్రతి బూత్ కమిటీ సభ్యుడు పార్టీ విజయమే లక్ష్యంగా ఒక సైనికుడిగా పని చేయాలన్నారు. మన క్రమశిక్షణే మన బలం అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రమశిక్షణకు మారుపేరు అని, అలాంటి నిబద్ధత కలిగిన నాయకుడి మార్గదర్శకంలో బూత్ కమిటీ మెంబర్లు చిత్తశుద్ధితో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్ఫూర్తిని అందిపుచ్చుకుని ప్రతి కార్యకర్త ప్రజల పట్ల నిస్వార్థమైన అంకితభావాన్ని కలిగి పని చేయాలని సూచించారు. టీడీపీని తెలుగు ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని, టీడీపీకి సంబంధించిన అందరూ ఒకే తల్లి పిల్లల్లా ఒకే కుటుంబంగా మెలగాలని, కార్యకర్తల విశ్వాసమే పార్టీకి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు.

'స్థానిక' ఎన్నికలే లక్ష్యం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సత్తా చాటడానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా, సమన్వయంతో కృషి చేయాలని మీనాక్షి నాయుడు స్పష్టం చేశారు. బూత్ స్థాయి నుంచే పార్టీని పటిష్టం చేయాలని ఆయన సూచించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరేకల్ రామకృష్ణ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, పట్టణాధ్యక్షులు తిమ్మపప మండల అధ్యక్షులు శివప్ప, ఎల్‌ఎల్‌సీ చైర్మన్ రామస్వామి, రంగస్వామినాయుడు, సాధికాబేగం, రాజేశ్వరి, టీడీపీ యువ నాయకులు భూపాల్‌చౌదరి, మారుతి నాయుడు, సిద్ధార్థ నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి పాల్గొన్నారు.

'పేదల అభివృద్ధి కోసం ముందుంటారు'



సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణతో తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ పేదల కష్టాలు తీర్చి వారి అభివృద్ధి కోసం కృషి చేసేందుకు ముందుంటారనీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, కార్యదర్శి తిమ్మయ్య చౌదరి అన్నారు. గురువారం కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రం సమీపంలోని కేరళ బీచ్‌లో రామకృష్ణ నిర్వహించిన ఓ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని రామకృష్ణతో మాట్లాడారు. కేరళ రాష్ట్రంలో అక్షరాస్యులు ఎక్కువగా ఉండటంతో ఎంతో అభివృద్ధి చెందుతుందని, మన రాష్ట్రంలో కూడా ప్రతి ఒక్కరూ విద్యపై దృష్టి సారిస్తే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందన్నారు

సొసైటీల అభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సొసైటీలు అభివృద్ధి చెందాలంటే రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని మారెళ్ల సొసైటీ అధ్యక్షులు వైవీ ప్రభాకర్‌రెడ్డి, సీఈవో మనోహర్ నాయుడు అన్నారరు. గురువారం వారు మాట్లాడుతూ నేటి నుంచి సహకార సొసైటీల్లో వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వారోత్సవాలకు రైతులందరూ హాజరు కావాలని, అలాగే సొసైటీలు రైతులకు అందించే రుణాలు, వ్యవసాయ పరికరాల గురించి తెలియజేస్తామన్నారు.

దేశ ఐక్యత, సమగ్రతను కాపాడాలి

ఎమ్మెల్యే డా.పార్థసారథి



సమైక్యతా ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్, విద్యార్థులు

ఆదోని, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యతను, సమగ్రతను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఆదోనిలో మై భారత్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివాస్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, ఆరేకల్ రామకృష్ణ పాల్గొన్నారు. ఆదోని పట్టణ ప్రధాన వీధులగుండా సమైక్యతా ర్యాలీ నిర్వహించి, అనంతరం మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఆధునిక భారతదేశ నిర్మాణానికి పునాది వేసిన మహనీయుడు అని, దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సర్దార్ పటేల్ లేని భారత్ మనకు ఊహించడమే భయంకరమన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి పౌరుడు నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కునిగిరి నీలకంఠ, నాగరాజుగౌడ్, ఉపేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

ఆలూరును సస్యశ్యామలం చేస్తాం

- టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి



మాట్లాడుతున్న ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

హాలహర్వి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేదావతి ప్రాజెక్టుని పూర్తి చేసి ఆలూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. గురువారం సీనియర్ నాయకులు ప్రకాష్ ఆధ్వర్యంలో గూళయలో ఆమెకు ఘన స్వాగతం పలికారు. తొలిసారిగా ఆమె గూళ్యం కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశం సందర్భంగా ఆమెకు గజమాలతో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడుతో చర్చించి వేదావతి ప్రాజెక్టుకు నిధులు తీసుకొస్తామన్నారు. అలాగే ఆలూరు తాలూకాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, జలాశయాలకు ప్రత్యేక నిధులు తీసుకొచ్చి నూతన పైపులైన్లు ఏర్పాటు చేసి ప్రతి పల్లెకు నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. . పథకాల జోరు అభివృద్ధి ఊర్లను చూసి వైసీపీ నేతలు జీర్ణియించుకోలేక పోతున్నారన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి అనేక పదవులు వస్తాయని, పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అన్నారు. అనంతరం పుణ్యక్షేత్రమైన గాదిలింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని ఆలయ అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలూరు మార్కెట్‌యార్డు చైర్మన్ బిల్లేకల్ వెంకటేష్, తాలూకా యువ నాయకులు సాయిదినేష్, ।ధర్, కటారుకొండ ।నివాస్, హోసల్లి సాగునీటి సంఘం అధ్యక్షులు మల్లన్న, గ్రామ అధ్యక్షులు మోకా గాదిలింగప్ప, పచ్చారపల్లి ప్రహ్లదరెడ్డి, బీజేపీ నాయకులు బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల కన్వీనర్ల ఎంపిక ప్రక్రియ పూర్తి

ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ మండల కన్వీనర్ల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. హొళగుంద, దేవనకొండ మండలాల కన్వీనర్లుగా ఉన్న విజయ్, తిప్పయ్యలను కొనసాగిస్తూ మిగిలిన నాలుగు మండలాల్లో కొత్త కన్వీనర్లను ఎంపిక చేసి ఆమోదం కోసం అధిష్టానానికి పంపినట్లు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి గురువారం తెలిపారు. ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి, ఆస్పరి మండలాల కన్వీనర్‌లుగా కటారుకొండ ।నివాసులు, పురుషోత్తం, ।ధర్, కురువ గోవింద్ పేర్లను ఎంపిక చేసి పార్టీ అధిష్టానంకు ఆమోదం కోసం పంపించారు. మండల కన్వీనర్‌లుగా ఇన్నేళ్లు పనిచేసిన వారిని గౌరవిస్తూ జిల్లా కమిటీలో ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఇన్‌చార్జి తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో వరలక్ష్మి

హాలహర్వి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ వరలక్ష్మి హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించాల్సిన బాధ్యత మీదేనని, పథకాలు సర్వే విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇలాగైతే మీ పని విషయంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి మీపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

లక్ష దీపోత్సవానికి తరలిరండి



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు

వెల్దుర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీన వెల్దుర్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించతలపెట్టిన 'కార్తీక దామోదర లక్ష దీపోత్సవం' కార్యక్రమానికి ప్రజలందరూ ఆహ్వానితులేనని మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు పిలుపునిచ్చారు. గురువారం స్వగృహంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో పూజ్యశ్రీ రూపేశ్వర్ చైతన్యదాస్ అధ్యక్షతన నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ క్రిష్ణమూర్తి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, శివసాయిబాబా కాల్వబుగ్గ, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హాజరుకానున్నారని తెలిపారు. కావునా కుటంబ సమేతంగా లక్షదీపోత్సవంలో పాల్గొనాలని తెలియజేశారు.

లోకకల్యాణం కోసం ధాత్రి పూజలు

ఆదోని టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంను పురస్కరించుకొని అభయ అంజనేయస్వామి దేవాలయంలో గురువారం ఆవోపా ఆధ్వర్యంలో లోకకల్యాణ కోసం ధాత్రి పూజలను నిర్వహించారు. కార్తీక వనభోజనంలో ఆర్యవైశ్య కుటుంబాలు పాల్గొని ఉసిరి వృక్షానికి పూజలు నిర్వహించారు. ప్రతాప్ ఈరన్న శెట్టి సౌజన్య కర్తగా వ్యవహరించిన కార్యక్రమాలలో ఆవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా, రఘు. వెంకటేశ్వర్లు, వెంకటేష్ బాబు, రఘు, రాజేష్, మమతాశ్రీ, శ్రీదేవి, సంతోషి, అనితరాధా, మైత్రేయి, మణి పాల్గొన్నారు.

పొదుపు సంఘాలను బలోపేతం చేయాలి

పత్తికొండ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలను బలోపేతం చేసే దిశగా సిబ్బంది పని చేయాలని డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి సూచించారు. ప్రధానంగా పొదుపు సంఘాలు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలను మంజూరు చేయిస్తామన్నారు.

పెచ్చులూడిన తరగతి గది



తరగతి గదిలో పెచ్చులూడిన దృశ్యం

దేవనకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా చుడాలని పదో తరగతి పరీక్షల జిల్లాఅధికారి గోవిందనాయక్ ఉపాధ్యాయులకు సుచనలు ఇస్తుండగా, పక్కనే ఉన్న పదో తరగతి గది పైకప్పు పెచ్చులుడింది. దేవనకొండ జెడ్పీపాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ఎస్ఏ1 పరీక్ష రాస్తుండగా ఘటనజరిగింది. గది తలుపుల వద్ద పెచ్చులూడిన సమయంలో ఎవ్వరు లేకపోవడంతో ఎవ్వరు ప్రమాదం తప్పింది. అనంతరం తరగతి గదిని జిల్లా అధికారి పరిశీలించారు.పెచ్చులుడిన గదిలోని విద్యార్థులను, పాఠశాలలోని సైన్స్ ల్యాబ్‌లోకి మార్చారు. పాఠశాలలో బాగున్న భవనాలలో పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షల భయం వీడి ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని పదో తరగతి విద్యార్థులకు సుచించారు. కెజీబీవీ ప్రిన్సిపాల్ సునీత, హెచ్ఎం నజీర్‌అహ్మద్, తదితరులు ఉన్నారు.

వారోత్సవాలను విజయవంతం చేద్దాం

వెల్దుర్తి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేద్దామని మండల గ్రంథాలయ అధికారి వి.తోటమ్మ గురువారం తెలిపారు. వారోత్సవాల సందర్భంగా 14న గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, స్వాతంత్ర సమరయోధుల జాతీయ నాయకుల పుస్తకాల ఏర్పాటు, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు ఎస్ఆర్ రంగనాథన్, పోతూరు నాగభూషణం, అయింటి వెంకట రమణయ్య మొదలగు వారిని స్మరించుకోవడం, రాష్ట్రంలోని స్వాతంత్ర పోరాటంపై స్వాతంత్ర సమరయోధుల ప్రసంగాలు, 17న 8, 9, 10 తరగతుల విద్యారుథలకు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు వ్యాసరచన, 18న స్వాతంత్ర ఉద్యమంపై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్రీడలు క్విజ్ పోటీలు, 19న మహిళా సాధికారతపై చర్చ, 20న అక్షరాస్యత దినోత్సవం, డిజిటల్ లైబ్రరీల ఉద్యమంపై దొరణి వంటి కార్యక్రమాలు నిర్వహించి వారోత్సవాల ముగింపు జరుగుతుందని ఆయన తెలిపారు.

ఆలూరు రూరల్: ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే 58వ గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని ఎంపీడీఓ మద్దిలేటి స్వామి, మొలగవల్లి గ్రంథాలయ అధికారి విజయ్‌భాస్కర్ అన్నారు. కార్యక్రమంలో వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

ఆస్పరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో అనుమానస్పదంగా సంచరించే వ్యక్తుల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ గంగాధర్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వలసలు వెళ్తున్న ప్రజలు తమ ఇంట్లో ఉన్న బంగారం, నగదు ఎక్కువ ఉంచుకోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలి

మద్దికెర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):మండలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చౌక దుకాణాల ద్వారా లబ్దిదారులకు అందించే సరుకులు తూకాల్లో తేడా లేకుండా సక్రమంగా అందించాలని తహసీల్దార్ గుండాల్ నాయక్ తెలిపారు. గురువారం డీలర్ల సమావేశంలో మాట్లాడుతూ సరుకులు పంపిణీ తూకాల్లో తేడాలు వస్తున్నట్లు లబ్దిదారుల నుంచి ఫిర్యాదులు వస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే నిత్యావసర సరుకులు అమ్మాలన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా చౌకదుకాణాలను తెరవాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పని చేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు

తుగ్గలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం పార్టీ బలోపేతానికి పని చేసిన ప్రతి ఒక్కరికి పార్టీ ప్రతి ఒక్కరికి గుర్తింపు ఇస్తుందని టీడీపీ మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు తిరుపాల్ నాయుడు, వెంకట్రాముడు చౌదరిలు అన్నారు. గురువారం టీడీపీ గ్రామ కమిటి అధ్యక్షులను ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షునిగా మద్దిలేటి చౌదరి, జొన్నగిరి కమిటి అధ్యక్షునిగా లక్ష్మణ స్వాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో వీరిని టీడీపీ నాయకులు పూలమాలలు, శాలువలతో సన్మానించారు. టీడీపీ నాయకులు మల్లయ్య ఉన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు

ఆలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆలూరు ఎస్ఐ మన్మథవిజయ్ హెచ్చరించారు. గురువారం అరికెర గ్రామంలో ఇటీవల జరిగిన ఘర్షణల నేపథ్యంలో గ్రామస్తులతో మాట్లాడారు. వివాదాలు, సమస్యలు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించినా సహించేది లేదన్నారు.

సహకార సొసైటీ చైర్మన్‌ల జాబితా ఖరారు

ఆలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలోని ఆరు సహకార ప్రాథమిక సొసైటీలకు చైర్మన్‌ల జాబితా ఖరారు అయ్యింది. ఆలూరు సొసైటీకి మొలగవల్లికి చెందిన బోయిని కురువ ఈరన్న, హొళగుందకు హెబ్బటం విష్ణువర్ధన్‌రెడ్డి, ఆస్పరికి మాజీ ఎంపీపీ రత్నమ్మ, చింతకుంటకు గూళ్యం కురువ ప్రకాష్, బెల్డోణకు కొండ బోయ రామంజిని, రామదుర్గం సొసైటీకి మండిగిరి లక్ష్మీకాంత్ పేర్లను ఖరారు చేశారు. అధికారికంగా రెండు రోజుల్లో ఉత్తర్వులు రానున్నట్లు అధికార వర్గాలు తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

క్రిష్ణగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):గృహ నిర్మాణాలను లబ్దిదారుల చేత వెంటనే పూర్తిచేయించాలని హౌసింగ్ పీడీ చిరంజీవి అన్నారు. గురువారం కంబాలపాడు, చుంచు ఎర్రగుడి గ్రామాలలో లబ్ధిఆరులు నిర్మించుకుంటున్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్దిదారులకు బిల్లులు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, ఎంపీడీఓ మోహన్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

సహకార సంఘం వారోత్సవాలను జయప్రదం చేయాలి

మద్దికెర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని మద్దికెర సహకార సంఘం సహకార వారోత్సవాలను జయప్రదం చేయాలని సింగిల్ విండో చైర్మన్ ఆకుల ఆనంద్, సీఈవో నాగరాజు కోరారు. గురువారం స్థానిక సహకార సంఘంలో రైతుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్లు సుగ్గలప్ప, చిన్నపెద్దన్న, సంఘం సిబ్బంది ఉన్నారు.

టీడీపీని మరింత బలోపేతం చేస్తాం

● ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, పార్టీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

● పార్టీ వివిధ కమిటీల అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, కన్వీనర్ల ప్రమాణ స్వీకారోత్సవం



ఎమ్మిగనూరులో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే బీవీ



మంత్రాలయంలో ప్రమాణం చేయిస్తున్న రాఘవేంద్ర రెడ్డి

ఎమ్మిగనూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో టీడీపీ, కూటమి క్యాడర్ బలంగా ఉండడంతోనే ప్రతిపక్షం ఇన్‌చార్జిలను మారుస్తోందని, నియోజకవర్గంలో టీడీపీని మరింత బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని కుర్ని కమ్యూనిటీ హాల్‌లో గురువారం టీడీపీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, గ్రామ అధ్యక్షులు, బూత్ కమిటీ కన్వీనర్ల ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో స్థానిక అధికార పార్టీ వైసీపీ ఎమ్మెల్యేకే ఆ పార్టీ సీటు ఇవ్వలేదన్నారు. బీసీల మీద ఎక్కడలేని ప్రేమను వలకబోసి బీసీ మహిళకు సీటు ఇచ్చారన్నారు. అప్పుడు బీసీల మీద ఉన్న ప్రేమ ఇప్పుడు మాయమైందని, కొత్త ఇన్‌చార్జిని తెచ్చిపెట్టారని అన్నారు. మన ప్రత్యర్థి వైఎస్ జగన్‌నే అన్నారు. గ్రామ స్థాయిలో ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు తెలియజేసి ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు. రాజకీయ వ్యూహాలు తనకు వదిలిపెట్టాలన్నారు. పార్టీలో ఎవరిని చేర్చుకోవాలో.. ఎవరిని పక్కన పెట్టాలో తనకు తెలుసునన్నారు. పార్టీని నమ్ముకొని పనిచేసిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి పదవులు వస్తాయన్నారు. పార్టీలో సీనియార్టీతో పాటు సమర్థత కూడా ఉండాలన్నారు. అప్పుడే పదవులు వస్తాయన్నారు. ఇక నుంచి తాను 15రోజులకు ఒకసారి మండల నాయకులతో సమావేశం అవుతానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, ఎమ్మిగనూరు పట్టణం, మండలం, నందవరం, గోనెగండ్ల మండలాల టీడీపీ కన్వీనర్లు మాచాని మహేశ్, కేటీ వెంకటేశ్వర్లు, కాశీంవలి, తిరుపతయ్యనాయుడు, కందనాతి సర్పంచ్ కేశన్న, డీలర్ ఈరన్న, భార్గవ్‌యాదవ్, కటారి రాజేంద్ర, షాబిర్, తురేగల్ నజీర్, జయన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్. రాఘవేంద్రరెడ్డి అన్నారు. మండలంలోని మాధవరంలో తన నివాసంలో గురువారం మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల టీడీపీ మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షుడు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ నాయకులుగా ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మంత్రాలయం, కోసిగి, కౌతాళం, పెద్దకడబూరు మండలాల అధ్యక్షులుగా ఎస్‌ఎం గోపాల్‌రెడ్డి, పల్లిపాడు రామిరెడ్డి, సురేష్‌నాయుడు, బసలదొడ్డి మల్లికార్జున ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందు టీడీపీ జెండాను ఎగురవేసి ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించి, కేక్ కట్‌చేసి పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ బలం పెరుగుతుండటంతో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని అన్నారు. నాలుగుసార్లు బీసీ ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి బీసీలపై కపటప్రేమ చూపిస్తున్నారని, ముందు రోజుల్లో వీటిని నమ్మే పరిస్థితుల్లో బీసీలు లేరని అన్నారు. మండలానికి ఒక్క నాయకుడిని పెట్టుకుని ఎంతదోచావో ప్రజలకు తెలుసు అని అన్నారు. టీడీపీ నాయకులు, మంచాల సింగిల్‌విండో అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, రాకేశ్‌రెడ్డి, రాజారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, వరదరాజు, నరసింహ, సొసైటీ డైరెక్టర్లు డీసీ తిమ్మప్ప, నగేష్, ముత్తురెడ్డి, నర్సరెడ్డి, అయ్యన్న, టిప్పుసుల్తాన్, అడివప్పగౌడ, వెంకటపతిరాజు, అశోకరెడ్డి, ఉరుకుందు, బొజ్జప్ప, చాకలి రాఘవేంద్ర, విజయ్‌కుమార్, నరసింహులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం



హోమంలో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దంపతులు

ఎమ్మిగనూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో గత 13 రోజుల నుంచి అత్యంత వైభవంగా జరుగుతున్న 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా గురువారం చండీ హోమాలు ఘనంగా నిర్వహించారు. ఈ హోమాల్లో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దంపతులు పాల్గొన్నారు. వందలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా సామూహిక హోమాల్లో పాల్గొన్నారు. హోమాల అనంతరం సీతారామచంద్రస్వామి సహస్ర కలశాభిషేకాలు నిర్వహించారు. అలాగే సాయంత్రం సీతారామచంద్రస్వామికి సామ్రాజ్య పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో మైదానం, యాగశాల భక్తులతో కిక్కిరిసింది. హోమాల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు శ్రీకృష్ణ మఠం పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానందస్వామిజీ ఫల, పుష్ప, మంత్రాక్షింతలిచ్చి ఆశీర్వదించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, నిర్వాహకులు సత్యనారాయణరెడ్డి, రాము, నటరాజరెడ్డి, మాచాని మహేశ్, మాచాని శివశంకర్ పాల్గొన్నారు.

రాఘవరాయలకు స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి బంగారు కవచ సమర్పణ సేవ చేశారు. రాఘవేంద్ర స్వామి సజీ వసమాధి పొందిన గురువారం కార్తీక నవమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. పీఠాధిపతి హస్తోదకం చేసి మహా మంగళ హారతులు ఇచ్చారు.

7న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే నెల 7న పూర్వప విద్యార్థుల సమ్మేళనం జరుగుతుందని, జయప్రదం చేయాలని ప్రిన్సిపాల్ పద్మావతి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఏటా డిసెంబరు మొదటి వారంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కుష్ఠు నివారణపై అవగాహన ర్యాలీ



గోనెగండ్లలో ర్యాలీ చేస్తున్న సిబ్బంది

గోనెగండ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పురువీధుల గుండా సాగింది. డాక్టర్ రాధ మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేకపోవడం, రాగి రంగు గల మచ్చలు, చర్మం పొడిగా ఉండటం, కనురెప్పలపై ఉన్న వెంట్రుకలు రాలిపోవడం, కన్నులు మూత పడకపోవడం, చర్మం మందం కావడం, అరచేతులు, కాళ్లు బొబ్బలు రావడం, చేతి వేళ్లు, కాలివేళ్లు వంకర పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మేరీగోల్డ్, ఎంపీహెచ్‌వో సుధాకర్, హనుమంతు, భారతి, విజయలక్ష్మి, ఎంపీహెచ్‌వో పరమేశ్, శాంతమ్మ, లక్ష్మీకాంతమ్మ, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నందవరం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. దీంతో గురువారం రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు బసవరాజు, శేఖర్, ఎల్లప్ప మాట్లాడుతూ అండర్-17లో 800 మీటర్ల పరుగు పందెంలో కవిత, మొదటి స్థానంలో నిలిచిందని, అండర్-17 హైజంప్‌లో ఓంకార్ మొదటి స్థానంలో, అండర్-17 లాంగ్ జంప్‌లో రెండో స్థానం లో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనపరచి జాతీయ స్థాయి కి ఎంపిక కావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి, నరసప్ప, రాజశేఖర్, రాఘవేంద్ర, రాజేష్, సుందరశ్రీసాగర్, హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో విత్తనాలు కలుపుతున్న సిబ్బంది

కోసిగి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి రైతు రసాయన ఎరువుల వాడకం తగ్గించి, గోమూత్రం, ఆవుపేడతో ప్రకృతి సేద్యం విధానాలతో వ్యవసాయం చేయాలని డివిజనల్ ట్రైనర్ నాగేష్ సూచించారు. మండలంలోని దుద్ది, కోల్‌మాన్‌పేట గ్రామాల్లో గురువారంయూనిట్ ఇన్‌చార్జి రాజామ్ ఆధ్వర్యంలో డీపీఎం మాధురి ఆదేశాల మేరకు దుద్ది గ్రామంలో ఐసీఆర్‌పీ నాగరాజు పొలంలోని నాలుగున్నర ఎకరాల పొలంలో పీఎన్‌డీఎస్ పద్ధతిలో విత్తనాలు వేశారు. ఈ పద్ధతి ద్వారా భూమిలోని సూక్ష్మ జీవులు, రైతుకు మేలు చేసే వానపాములు, ఎండవేడిమికి చనిపోకుండ ఉండేందుకు ఉపయోగ పడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి ఎక్కువ లాభాలు పొందుతారన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు, సిబ్బంది ఉన్నారు.

'అందరినీ కలుపుకొని ముందుకెళ్తాం'



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రంగస్వామినాయుడు

గోనెగండ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అందరినీ కలుపుకొని ముందుకెళ్తామని టీడీపీ గోనెగండ్ల క్లస్టర్ ఇన్‌చార్జిగా ఎంపికైన రంగస్వామినాయుడు అన్నారు. గురువారం గోనెగండ్ల క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమించడంతో రంగస్వామి నాయుడు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిని పూలమాలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ, బీవీ జయనాగేశ్వరరెడ్డి తన కష్టాన్ని గుర్తించి ఈ పదవి అప్పగించారని అన్నారు. కార్యక్రమంలో బేతాల బడేసా, నజీర్‌సాహెబ్, మహల్ రహంతుల్లా, రాంపురం రఫీక్, అడ్వకేట్ చంద్రశేఖర్, రమేష్‌నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కార్యకర్తలను ఆదుకుంటాం'



లక్ష్మన్నను పరామర్శిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

మంత్రాలయం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను ఆదుకుంటామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథరెడ్డి అన్నారు. మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఉలువ లక్ష్మన్న, ఎంసీ లక్ష్మన్న రాయచూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబాలకు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన మాట్లాడుతూటీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఎటువంటి ఆపద, కష్టం వచ్చినా తిక్కారెడ్డి కుటుంబం అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు టీడీపీ నాయకులు ఉమాకాంత్‌రెడ్డి, పైబావి నర్సిరెడ్డి, ఎంసీ నరసింహులు, తెలుగు అంజని తదితరులు పాల్గొన్నారు.

కోసిగి సచివాలయ సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

● 115 ఉద్యోగులకు గాను 68 మంది మాత్రమే ముఖ హాజరు నమోదు.. 47 మంది గైర్హాజరు

● నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోకు ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసిగి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలో గ్రామ సచివాలయాలు అస్తవ్యస్తం. సచివాలయాల్లో కొరవడిన ఉద్యోగుల పాలన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో గురువారం ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలకు కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోసిగి మండలంలోని సచివాలయ ఉద్యోగుల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం 115 మంది సచివాలయ ఉద్యోగులకు గానూ 68 మంది మాత్రమే ఉద్యోగులు ముఖ హాజరు వేసుకోవడంతో 47 మంది ఉద్యోగులు హాజరు కూడా వేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారికి నోటీసులు అందించాలని కోసిగి ఎంపీడీవో మహ్మద్ బాషా, డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామికి ఆదేశించారు. కోసిగి మండలంలో సమయపాలన పాటించని ఉద్యోగుల పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారనీ ఎంపీడీవో తెలిపారు. ఫీల్డ్ విజిట్ పేరుతో కార్యాలయాల్లో ఉండకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉద్యోగులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. 47 మంది గైర్హాజరైన ఉద్యోగులకు నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు.

నిలిచిన బస్టాప్ నిర్మాణం



నిలిచిపోయిన బస్టాప్ పనులు

కోసిగి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.బెళగల్ ఆర్టీసీ బస్టాప్ పదేళ్లుగా మొండి గోడలతో దర్శనం ఇస్తోంది. వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేసే వారువానకు, ఎండకు ఉంటూ రోడ్డుపై నిలబడి బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి మొండి గోడలతో నిలిచిపోయిన డి.బెళగల్ ఆర్టీసీ బస్టాప్‌ను నిర్మించి నీడ కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పన్నులు వంద శాతం వసూళ్లు చేయాలి

గోనెగండ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ గోనెగండ్లలో ఈ ఏడాది వందశాతం ఇంటి పన్నులు, కొళాయిపన్నులు, దుకాణాల పన్నులు వసూళ్లు చేయాలని పంచాయతీ సిబ్బందిని గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, ఈవో సతీష్ ఆదేశించారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2025-26 కు సంబంధించిన పన్నులు వందశాతం వసూళ్లు చేయాలని గతంలో పెండింగ్‌లో ఉన్న పన్నులు కూడా ఈ ఏడాది వసూళ్లు చేసి పంచా యతీ ఆదాయాన్ని పెంచి అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. అలాగే ప్రతి ఇంటి యజమాని ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తో వెళ్లి ఇంటి నెంబర్‌కు లింక్ చేయించుకోవాలని సూచించారు. గ్రామంలో ప్రతి మంగళవారం, శని, గురువారాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య తీర్చేందుకుగాను గ్రామంలో నాలుగు ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్‌బాషా, సుభాన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం

మంత్రాలయం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి కోయంబత్తూరులోని మెట్టుపాల్యం కి చెందిన ఎస్‌ఎస్‌వీ అరముగం అనేభక్తుడు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాస రావు, సురేష్‌కోణాపూర్ తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానానికి విరాళం ఇచ్చినట్లు తెలిపారు.విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పెద్దకడబూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పెద్దకడబూరు మండలంలో శుక్రవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ ఆశాజ్యోతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, విద్యావంతులకు లైబ్రేరియన్ ఆవశ్యకతను తెలియజేయనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

పెద్దకడబూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పెద్దకడ బూరులో 16వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ కంటి వైద్యుడు, ఆర్‌కే కంటి వైద్యశాల నిర్వాహకుడు హేమంత్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ కంటి వైద్య శిబిరాన్ని ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైన కంటి రోగులకు ఉచితంగా చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 814242420082, 9052761551 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

రహదారులు అధ్వానం

● మోరు గుంతను రాళ్లతో కప్పిన వైనం

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గాంధీనగర్‌లో గుంతలు పడిన రోడ్డు



మోరు గుంతపై రాళ్లను పేర్చిన దృశ్యం

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రోడ్లపై పడిన గుంతలకు మరమ్మతులు చేసి గుంతలు పూడ్చాల్సిన అధికారులు, అ గుంతలు కనపడకుండా పైన రాళ్ళు కప్పి చేతులు దులుపేసు కుంటున్నారు అధికారులు. పట్టణంలోని గాంధీనగర్ మెయిన్ రోడ్డులో మోరుకు గుంత పడింది, దాంతో పాటు అదే రోడ్డులో ఆదోని బైపాస్ రోడ్డు నుంచి కిందకు రాకపోకలు ఎక్కువగా కొనసాగుతుంటాయి అదే రోడ్డు నందు పలు చోట్ల గుంతలు పడ్డాయి, పైగా రోడ్డు కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. తిక్కారెడ్డి ఇంటి సమీపంలో కొంచెం భారీగా గుంత పడడంతో దానికి మరమ్మత్తులు చేయకుండా అధికారులు తాత్కలికంగా రాళ్ళు పోగు చేసి దాని పూడ్చే ప్రయత్నం చేశారు. రాత్రి సమయంలో వాహనాలు ప్రమాదానికి గురయ్యే పరిస్థితులు ఉన్నాయి. గుంతలకు మరమ్మతులు త్వరగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తేలు కాటుతో బాలిక మృతి

● పొలానికి వెళ్లి తేలు కాటుకు గురైన 8వ తరగతి విద్యార్థిని

● తల్లిదండ్రులిద్దరూ దివ్యాంగులే

● దైవందిన్నె గ్రామంలో విషాద ఘటన



సరస్వతి (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చదువుల తల్లి సరస్వతి ఇక లేదు. బాలిక తల్లిదండ్రుల్లిద్దరూ దివ్యాంగులు కావడంతో పెద్ద కుమార్తె కుటుంబ పెద్దగా బాధ్యతలు చేపట్టింది. స్కూల్‌కు వెళ్తూనే పొలం పనులు చేసుకునేది. అయితే విధి చిన్నచూపు చూసింది. తేలుకాటుతో ఆ బాలిక మృతి చెందింది. ఈ విషాద ఘటన మండలంలోని దైవందిన్నె గ్రామంలో జరిగింది. వివరాలివీ.. గ్రామానికి చెందిన శేఖర్, శకుంతలమ్మ దంపతులు దివ్యాంగులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. వీరి పెద్ద కుమార్తె సరస్వతి(13) గ్రామంలోని పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. బుధవారం పొలం పనులు చేస్తుండగా తేలు కాటుకు గురైంది. అయితే గురువారం ఉదయం వాంతులు అవుతుండడంతో ఎమ్మిగనూరుకు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే బాలిక మృతి చెందింది. తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటూ సెలవు దినాల్లో కూలీ పనులకు వెళ్లేది. సరస్వతి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాలతో టీడీపీ గ్రామ అధ్యక్షుడు రామాంజనేయులు, రామచంద్ర రూ.5వేల సాయం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సహకారంతో మృతురాలి బాలిక కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటా మన్నారు. అంజినయ్య, నాగేష్, కృష్ణ, రామాంజనేయులు ఉన్నారు.



బాలిక కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు